

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 04-05-2025 | సంపుటి - 23 | సంచిక - 04 | రూ : 4 | పేజీలు: 8


## మరో రూ.300 కోట్ల పెట్టుబడులు!

- ముందుకొచ్చిన సిరా నెట్‌వర్క్, ఎల్‌సీజీసీ రెజల్యూట్ సంస్థలు
- మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశం



**మే 3, హైదరాబాద్:** రాష్ట్రంలో రూ.300 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు టెలికం ఉత్పత్తుల సంస్థలైన సిరా నెట్‌వర్క్ (తైవాన్), ఎల్‌సీజీసీ రెజల్యూట్ గ్రూప్ (తెలంగాణ) సంయుక్తంగా ముందుకు వచ్చాయి. ఈ సంస్థల ప్రతినిధులు శనివారం సచివాలయంలో ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమయ్యారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పది ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ పరిశ్రమ ద్వారా 2500 మందికి ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ఇందులో 5జీ నెట్‌వర్క్, మల్టీలేయర్ నెట్‌వర్కింగ్ సొల్యూషన్స్, సర్వర్లు

తరువాయి 2లో



## మూసీని మూసేస్తుంటే.. కళ్లు మూసుకున్నారు

- యథేచ్ఛగా ఉల్లంఘనలు.. షరతులు హుష్‌కాకి...
- నది ఒడ్డునే 38 అంతస్తుల భారీ నిర్మాణం

**మే 3, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం మూసీ నది ప్రక్షాళనకు ప్రత్యేకంగా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను 2017లో ఏర్పాటు చేసింది. నది బఫర్ జోన్ పరిధిలో 50 మీటర్ల వరకు, ఆ తర్వాత 100 మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలకు అనుమతించకూడదని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే నిర్మించిన దాదాపు 15వేల కట్టడాలను తొలగించాలనే ప్రతిపాదన ఉంది. కొత్తగా అనుమతులు ఇవ్వకూడదు. కానీ ఈ భవంతి నిర్మిస్తున్న పరిస్థితుల్లో మూసీ ప్రక్షాళన సాధ్యమవుతుందా అనే ప్రశ్న వ్యక్తమవుతోంది. అనుమతుల జారీలో హెచ్‌ఎండీఏలో భారీగా సొమ్ములు చేతులు మారి ఉంటాయన్న ప్రచారం జరుగుతోంది.

తరువాయి 2లో

## అల్బనీస్‌కే .. మళ్లీ పట్టం

- మరో మూడేళ్లు ఆస్ట్రేలియా ప్రధానిగా ఆయనే

మెల్‌బోర్న్, ఢిల్లీ: ఆస్ట్రేలియా ఎన్నికల్లో ప్రధాన మంత్రి ఆంథోనీ అల్బనీస్ నేతృత్వంలోని మధ్యేవాద వామపక్ష లేబర్ పార్టీ మరోసారి విజయం దిశగా దూసుకుపోతోంది. దీంతో మరో మూడేళ్లపాటు ఆయనే ప్రధానిగా కొనసాగనున్నారు. 21 ఏళ్ల తర్వాత వరుసగా రెండోసారి గెలిచిన నేతగా

తరువాయి 2లో







## 3 ఏళ్లలో అమరావతి నిర్మాణాలు పూర్తిచేయాలి

- మంత్రులు, కూటమి ప్రజాప్రతినిధులతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్
- ప్రజల భాగస్వామ్యంతో సభ విజయవంతమైందన్న సీఎం
- మోదీ ప్రసంగం భవిష్యత్తు రాజధానిని ఆవిష్కరించిందని వ్యాఖ్య

**మే 3, అమరావతి:** మూడేళ్లలో అమరావతి రాజధాని నిర్మాణ పనులను పూర్తిచేసి, ఘనంగా ప్రారంభోత్సవాలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఇక అంతా మీ చేతుల్లోనే ఉందంటూ పురపాలక శాఖ మంత్రి నారాయణకు లక్ష్యాన్ని నిర్దేశించారు. నిర్దేశిత లక్ష్యం మేరకు పనులు పూర్తి చేస్తామని ఈ సందర్భంగా సీఎంకు నారాయణ తెలిపారు. ప్రధాని సభ విజయవంతమైన నేపథ్యంలో కూటమి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలతో శనివారం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'అమరావతి ఒక నగరం కాదు.. అధునాతన శక్తిగా మారుతుంది' అంటూ అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం స్ఫూర్తి నింపిందని తెలిపారు. రాష్ట్ర వృద్ధిరేటుకు అమరావతి కేంద్రంగా ఉంటుందన్న ప్రధాని వ్యాఖ్యలు భవిష్యత్తు రాజధానిని ఆవిష్కరించాయని పేర్కొన్నారు. ప్రజా రాజధానికి ఆయన భరోసా

తరువాయి 2లో

## ఉగ్రవాదులు నిఘా వర్గాల్ని ఏమార్చారా?

- వేరే ప్రాంతంలో దాడి అంటూ సమాచారం
- భద్రతా దళాలు అక్కడ నిఘా పెంచగా బైసరన్‌లో దాడి



**మే 3, ఢిల్లీ:** పహల్గాం దాడికి ముందు ఉగ్రవాదులు నిఘా వర్గాలను ఏమార్చారా.. అంటే అవుననే అధికార వర్గాలు అందిస్తున్న సమాచారం సూచిస్తోంది. శ్రీనగర్ శివారులో జబర్వాన్ కొండ ప్రాంతాల్లోని హోటళ్లలో బస చేసిన పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయనున్నారని పహల్గాం దాడికి కొన్ని రోజుల ముందు నిఘా వర్గాలకు సమాచారం అందిందని అభిజ్ఞ వర్గాలు తెలిపాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. దాచిగామ్,

తరువాయి 2లో

## పాకిస్థాన్‌పై మరిన్ని ఆంక్షలు



2లో

- దిగుమతులు, నౌకలపై నిషేధం విధించిన భారత్
- ఉత్తరాలు, పార్సిల్ సేవలూ నిలిపివేత
- అబ్దాలీ క్షిపణుల్ని పరీక్షించిన పాక్

## పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత.. ప్రధాని మోదీతో మొదటిసారి ఒమర్ అబ్దుల్లా భేటీ

- ప్రధాని మోదీతో అరగంట పాటు ఒమర్ అబ్దుల్లా భేటీ
- శనివారం ఢిల్లీలోని ప్రధాని నివాసంలో సమావేశం
- పహల్గామ్ ఉగ్రదాడి సహా పలు అంశాలపై సంప్రదింపులు

**మే 3 :** జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా దేశ రాజధాని ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ప్రధానమంత్రి అధికారిక నివాసంలో వీరిద్దరి మధ్య భేటీ జరిగిందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశం సుమారు 30 నిమిషాల పాటు కొనసాగింది. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడితో సహా పలు కీలక అంశాలపై ప్రధానమంత్రి మోదీ, ఒమర్ అబ్దుల్లా చర్చించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా పర్యాటకులే లక్ష్యంగా జరిగిన ఈ దాడి ఘటన అనంతరం నెలకొన్న పరిస్థితులు, భద్రతాపరమైన అంశాలు వీరి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. గత నెల 22వ తేదీన పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మరణించిన విషయం తెలిసిందే. ఈ విషాద సంఘటన తర్వాత ప్రధానమంత్రి మోదీ, ఒమర్ అబ్దుల్లా నేరుగా సమావేశం కావడం ఇదే మొదటిసారి.



# మూసీని మూసేస్తుంటే.. కళ్లు మూసుకున్నారు

(మొదటిపేజీ తరువాయి)

దీనిపై రెవెన్యూ అధికారులను వివరణ అడిగితే న్యాయస్థానం ఆదేశాల ప్రకారం నిర్మాణం కొనసాగిస్తున్నారని చెబుతున్నారే తప్ప.. షరతులు పాటించని విషయంపై మాట్లాడడం లేదు.

**వివాదాల మధ్య..**

ఈ భవంతిని 9.19 ఎకరాల విస్తీర్ణంలోని పట్టాభూమిలో రెండు సెల్లార్లు, నాలుగు బ్లాక్‌లు, ఒక గ్రౌండ్ ఫ్లోర్, 38 అంతస్తులతో నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం బఫర్ జోన్ వదులుతున్నట్లు, అన్ని రకాల నిబంధనలు పాటిస్తున్నట్లు దరఖాస్తు చేయడంతో క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే అన్ని స్థాయిల అధికారులు అనుమతులు ఇచ్చేశారు. మూసీ నది ఆక్రమణపై ఫిర్యాదులు రావడంతో భవన నిర్మాణ అనుమతులు రద్దు చేస్తామంటూ 2023 ఆగస్టులో హెచ్‌ఎండీఏ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులకు సంస్థ ఇచ్చిన వివరణపై హెచ్‌ఎండీఏ సంతృప్తి చెందలేదు. సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. తర్వాత అధికారుల నుంచి నివేదికను, సంస్థ నుంచి ఓ ప్రమాణ పత్రం తీసుకున్న న్యాయస్థానం ఆ మేరకు పిటిషన్‌ను మూసివేసింది. సంస్థ మళ్లీ నిర్మాణం ప్రారంభించింది.

*** సంయుక్త కమిటీ ముఖ్య పరిశీలనాంశాలు ఇవీ...**

రెవెన్యూ, హెచ్‌ఎండీఏ, జలవనరుల శాఖ అధికారులు 29.5.24న క్షేత్రస్థాయిలో ఈ భవంతికి సంబంధించి సంయుక్త విచారణ నిర్వహించి నివేదిక ఇచ్చారు. పట్టాభూమి 9ఎకరాల 19 గుంటల్లో నది వైపు 50 మీటర్ల వరకు బఫర్ జోన్ వదలాల్సి ఉంది. అంటే దాదాపు 3ఎకరాల 9గుంటల స్థలం బఫర్ జోన్ కింద ప్రభావానికి గురవుతుందని నివేదించారు. నదిని ఆక్రమించి నింపిన వ్యర్థాలను, నది మధ్యలో వేసిన భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని, ఒక కాంటా, మిక్సింగ్ ప్లాంటు (బాచింగ్) బఫర్ జోన్‌లో ఉన్నాయని తెలిపారు. లోలెవల్ కాజ్‌వే కూడా మట్టితో పూడిపోయినట్లు గుర్తించారు. బఫర్ జోన్ పరిధిలో కాంక్రీట్ నిర్మాణాలు చేయకూడదని పేర్కొన్నారు. అధికారులు బఫర్ జోన్ హద్దు గుర్తించాలి... అక్కడ బోర్డులు ఏర్పాటు చేయాలి... నది ప్రవాహ మట్టం గుర్తించి బోర్డు ఏర్పాటు చేయాలి అని స్పష్టం చేశారు.

**కానీ ఏం జరుగుతోంది...**

నిర్మాణ స్థలం నదిలోనే ఉన్నట్లు కనిపిస్తోంది. మూసీ నది వెడల్పు వివిధ ప్రాంతాల్లో ఒక్కో రకంగా ఉంటుంది. కనీసం 50 మీటర్ల నుంచి 100, 200 మీటర్ల వరకు ఉంది. నిర్దేశిత ప్రాంతంలో ఎంత ఉందనేది అధికారులు స్పష్టత ఇవ్వలేదు. కానీ పట్టాభూమి 9ఎకరాల 19 గుంటలకు రేఖా చిత్రం ఇచ్చారు. ఇది నదిలోకి చొచ్చుకు వచ్చింది. అక్కడి నుంచి 50 మీటర్ల దూరం బఫర్ జోన్, 9 మీటర్లు సెట్‌బ్యాక్ వదలాలని సూచించారు. బఫర్‌జోన్ వద్ద కాంక్రీట్ గోడ తొలగించిన సంస్థ ఫెన్సింగ్ వేసింది. నిర్మాణ సామగ్రి నదిలోనే ఉంది. వెనుక వైపు మూసీ చాలా వరకు పూడిపోయింది. కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంటు, కాంటా అలాగే ఉన్నాయి. ఎక్కడా రెవెన్యూ, జలవనరుల శాఖల హెచ్చరిక బోర్డులు లేవు. పూడిపోయిన లోలెవల్ కాజ్‌వేలో మట్టిని తొలగించాలని సూచించినా జరగలేదు. బఫర్ జోన్ 50 మీటర్లనే భవన నిర్మాణ అనుమతుల్లో ఖాళీ స్థలంగా చూపించినట్లు చెబుతున్నారు.

# అల్బనీస్‌కే మళ్లీ పట్టం

(మొదటిపేజీ తరువాయి)

అల్బనీస్ నిలవనున్నారు. ప్రతిపక్ష కూటమి నేత పీటర్ డ్యూటన్ ఓటమిని అంగీకరించారు. కూటమి ఓటమితోపాటు సొంత సీటులోనూ ఆయన ఓడిపోయారు. ఓటమికి తనదే బాధ్యతని లిబరల్ పార్టీ నేత అయిన డ్యూటన్ స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా ప్రతినిధుల సభలో మొత్తం 150 స్థానాలుండగా లేబర్ పార్టీ 81 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ప్రతిపక్ష కూటమి 35, ఇతరులు 13 స్థానాల్లో గెలుపునకు దగ్గరగా ఉన్నారు. మరో 21 చోట్ల ఫలితాల సరళి తెలియరాలేదు. ఇప్పటివరకూ లెక్కించిన ఓట్లలో లేబర్ పార్టీకి 55.4 శాతం ఓట్లు వచ్చాయి. మరోవైపు పలువురు మహిళలు స్విమ్ సూట్‌లో, పురుషులు కేవలం అండర్ వేర్‌తో పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మోదీ శుభాకాంక్షలు: ఆస్ట్రేలియా ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన అల్బనీస్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

# ఉగ్రవాదులనే కాదు.. వంతపాడేవాళ్లనూ వదలం

**అంగోలా అధ్యక్షుడితో మోదీ**

దిల్లీ: ఉగ్రవాదులనే కాదు. వారి మద్దతుదారులనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, తీవ్రమైన చర్యలు తీసుకుంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. నాలుగు రోజుల భారత పర్యటనకు వచ్చిన అంగోలా అధ్యక్షుడు జువా మనువెల్ గొంజాల్వెజ్ లౌరెన్సాతో శనివారం ప్రధాని భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు పహల్గాం ఉగ్రదాడి అంశంపైనా ఇరువురు నేతలు చర్చించుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మోదీ మాట్లాడుతూ ''ఉగ్రవాదం మానవాళికి అతి పెద్ద ముప్పు అన్న విషయంలో మేం ఏకాభిప్రాయంతో ఉన్నాం. పహల్గాం ఉగ్రదాడిలో మరణించినవారికి సంతాపం తెలిపినందుకు అధ్యక్షుడు లౌరెన్సా, అంగోలా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపాను'' అని పేర్కొన్నారు. అంగోలా సైన్యం ఆధునికీకరణకు 20 కోట్ల డాలర్ల రుణాన్ని అందిస్తున్నట్లు ప్రకటించారు. లౌరెన్సా పర్యటన.. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలకు ఓ దిశను ఇవ్వడమే కాకుండా, భారత్‌ఆఫ్రికా సంబంధాలను బలోపేతం చేస్తుందన్నారు. అంతరిక్ష పరిశోధన, ఆరోగ్యం, ఎరువులు, అరుదైన ఖనిజాలు తదితర రంగాల్లోనూ కలిసి పనిచేయాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయని తెలిపారు.





*** రేపు నితిన్ గడ్కరీ చేతుల మీదుగా 26 ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు**

*** కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

# రాష్ట్రాభివృద్ధికి కేంద్రం బాటలు

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ రహదారులతో తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, రాష్ట్రంతో ముడిపడి ఉన్న రూ.లక్ష కోట్ల విలువైన ఐదు జాతీయ రహదారి ప్రాజెక్టులు త్వరలో అందుబాటులోకి రానున్నాయని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మే 5న కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్రంలో రూ.5,416 కోట్లతో 26 ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని వెల్లడించారు. మొదట ఉమ్మడి ఆదిలాబాద్‌లోని కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు వద్ద, తర్వాత హైదరాబాద్ అంబర్‌పేటలో కార్యక్రమాలకు హాజరవుతారని.. రెండు చోట్ల సభల్లో పాల్గొంటారని చెప్పారు. శనివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ''మౌలిక వసతుల కల్పనలో 2014 తర్వాత నవశకం ఆరంభమైంది. ప్రధాని మోదీ దేశం ముఖచిత్రాన్ని మార్చే దిశలో ముందుకు వెళ్తున్నారు. 2014లో రాష్ట్రంలో 2,500 కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉండగా, ఇప్పుడు అవి 5,200 కిలోమీటర్లకు చేరుకున్నాయి. తెలంగాణలో 33 జిల్లాలు ఉండగా 32 జిల్లాలతో జాతీయ రహదారులు అనుసంధానం అయ్యేలా కేంద్ర ప్రభుత్వం రహదారులను నిర్మించింది. ఇప్పటికే అనేక జాతీయ రహదారులు, ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మాణమయ్యాయి. రాష్ట్రానికి మరిన్ని అభివృద్ధి ప్రాజెక్టులు రానున్నాయి'' అని కిషన్‌రెడ్డి తెలిపారు.

**కులగణన మోదీ గొప్పతనం**

కులగణనపై కేంద్రమంత్రి స్పందిస్తూ.. దేశంలో మొదటిసారి కులగణన జరుగుతోందని, అది మోదీ గొప్పతనమన్నారు. తెలంగాణలో జరిగింది కులగణన కాదని, అది కేవలం కుల సర్వే అని వ్యాఖ్యానించారు. తాము కులగణనకు వ్యతిరేకం కాదని, కాకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల్లో ముస్లింలను చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో కులగణన జరగకుండా కాంగ్రెస్ రోల్‌మోడల్ ఎలా అవుతుందని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు.

# నేడే 'నీట్' రాష్ట్రంలో 190 కేంద్రాల్లో పరీక్ష

హైదరాబాద్: ఎంబీబీఎస్ ప్రవేశాల కోసం చేపట్టే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్ యూజీ 2025) ఆదివారం దేశవ్యాప్తంగా జరగనుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) దీన్ని నిర్వహిస్తోంది. గతేడాది 'నీట్' ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో ఈసారి పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో 'నీట్' 24 పట్టణాల్లో 190 కేంద్రాల్లో జరగనుంది. హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 62 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 72,507 మంది రాష్ట్ర విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు రాష్ట్రంలో 'నీట్' నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించి అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతుంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలలోపు విద్యార్థులు కేంద్రంలోకి చేరుకోవాలి. ఆ తర్వాత అనుమతించరు. గడియారాలు, బూట్లు, ఇతర గ్యాడ్జెట్లు, నిషేధిత పదార్థాలను తీసుకెళ్లకూడదు. గతేడాది రాష్ట్రంలో నీట్ దరఖాస్తులు 79,813 రాగా, ఈసారి 7,306 తగ్గడం గమనార్హం.




# మరో రూ.300 కోట్ల పెట్టుబడులు!

(మొదటిపేజీ తరువాయి)

సంబంధిత ఉత్పత్తులు తయారవుతాయన్నారు. ఈ పెట్టుబడితో ఇండో తైవాన్ మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ పరిశ్రమల్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్‌సిటీలో ఎలక్ట్రానిక్ సిటీ (ఈసిటీ)ని అభివృద్ధి చేయనున్నట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. ''పరిశ్రమల ఏర్పాటులో పారిశ్రామికవేత్తలకు ఇబ్బంది కలగకుండా సంబంధిత అధికారులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తాం. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకువచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలిస్తాం. వారి అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తాం'' అని శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ సమావేశంలో టీజీఐఐసీ సీఈవో మధుసూదన్, టీఫైబర్ ఎండీ వేణుప్రసాద్, సిరానెట్‌వర్క్ ప్రతినిధులు చుయాన్, జాయ్‌భట్టాచార్య, డౌగియాస్, ఎల్‌సీజీసీ రెజల్యూట్ గ్రూప్ నుంచి రణ్వీందర్‌సింగ్, గీతాంజలి సభర్వాల్ పాల్గొన్నారు.

# 3 ఏళ్లలో అమరావతి నిర్మాణాలు పూర్తిచేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారని, దేశానికే అమరావతి మార్గదర్శిగా రూపొందుతుందని మోదీ అనడం గర్వకారణమని చెప్పారు. ప్రజలందరి భాగస్వామ్యం, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తల కృషితో సభ విజయవంతమైందని వెల్లడించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సమన్వయంతో పనిచేశారని, ప్రభుత్వ యంత్రాంగం సమర్థంగా విధులు నిర్వర్తించిందంటూ సీఎం అభినందించారు.

**వైకాపా వారికి ఏం మాట్లాడాలో అర్థంకావడం లేదు**

చీటికీమాటికీ విమర్శలు చేసే వైకాపా వారికి మోదీ సభ విజయవంతమవ్వడంతో ఏంచేయాలో అర్థం కావడం లేదని పలువురు మంత్రులు ఈ సందర్భంగా ప్రస్తావించారు. చంద్రబాబు స్పందిస్తూ.. అమరావతి ఆవశ్యకతను వివరించేందుకే మోదీ చేతుల మీదుగా రాజధాని పనుల్ని పునఃప్రారంభించినట్లు వెల్లడించారు. 'ప్రధాని ప్రసంగం రాష్ట్రాభివృద్ధి, ప్రజలపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. మంత్రులు, నేతలు ఎవరి బాధ్యతల్ని వారు సక్రమంగా నిర్వర్తించారు. లక్షల మంది వచ్చినా ఎక్కడా అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు. అన్ని ప్రాంతాల వారి భాగస్వామ్యంలో కార్యక్రమం ఉత్సాహంగా, ఆశావహ దృక్పథంతో జరిగింది' అని వివరించారు. 'ప్రజల సహకారం, కేంద్రం మద్దతు, పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా.. రాష్ట్రానికి చోదకశక్తిగా నిలిచేలా.. భవిష్యత్తు నగరంగా అమరావతిని నిర్మిస్తాం. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధిస్తూ.. మాకు అండగా నిలిచిన ప్రజల నమ్మకాన్ని నిలబెడతాం' అని సీఎం 'ఎక్స్'లోనూ పేర్కొన్నారు. 'అమరావతి ఎదుగుతుంది.. ఇది దేవుడి సంకల్పం' అని పేర్కొన్నారు. పురాణాల్లో అమరావతి ప్రస్తావన మొదలు.. శాతవాహనుల రాజధానిగా వెలుగొందిన నాటి నుంచి నేటి వరకు రాజధాని వైభవాన్ని వివరిస్తూ రూపొందించిన వీడియోను పోస్టుకు జత చేశారు.

# ఉగ్రవాదులు నిఘా వర్గాల్ని ఏమార్చారా?

(మొదటిపేజీ తరువాయి)

నిషాత్ ప్రాంతాల్లో పోలీసు బలగాలు విస్తృతంగా కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహించాయి. గత సంవత్సరం అక్టోబరులో ఉగ్ర దాడి జరిగిన గంగన్‌గిర్, సోన్‌మార్గ్ ప్రాంతాల్లో నిఘా, పహరా పెంచారు. ఆయా ప్రాంతాల్లో గత అక్టోబరులో జరిగిన ఉగ్రవాద దాడిలో ఏడుగురు మరణించారు. తమకు అందిన సమాచారం నేపథ్యంలో దాదాపు రెండు వారాలపాటు భద్రతా సిబ్బంది శ్రీనగర్ శివార్లలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆ చర్యల్ని గత నెల 22న ఆపేశారు. పహల్గాంలో ఉగ్రవాదులు అదే రోజు దాడి చేసి 26 మంది పర్యాటకులను పొట్టనపెట్టుకున్నారు. కట్రా, శ్రీనగర్ మధ్య తొలి రైలును ప్రారంభించడానికి ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూకశ్మీర్‌కు వస్తున్న సందర్భంగా దాడి చేయాలని ఉగ్రవాదులు పథకం పన్నారని నిఘా వర్గాలకు సమాచారం అందింది. కశ్మీర్‌ను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించే కట్రా రైలు మార్గం ఏర్పాటు కావడం పాకిస్థాన్‌కు ఏమాత్రం ఇష్టం లేదు. ప్రధాన మంత్రి గత నెల 19న రైలుమార్గం ప్రారంభానికి కట్రా ప్రాంతాన్ని సందర్శించాల్సి వుంది. కానీ ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఆయన పర్యటన వాయిదా పడింది. ఈ రైలు మార్గం ఎప్పుడు ప్రారంభమయ్యేదీ త్వరలో ప్రకటిస్తారని అధికారులు తెలిపారు. పహల్గాం దాడిలో ఇద్దరు స్థానిక ఉగ్రవాదులు పర్యాటకుల్లో కలిసిపోయారు. తొలి కాల్పులు జరిగిన వెంటనే వారు పర్యాటకుల్ని ఆ ప్రాంతంలోని ఫుడ్‌కోర్టు వద్ద జమయ్యేలా ప్రోత్సహించారు. అక్కడ ఉన్న ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడ్డారు.

# పాకిస్థాన్‌పై మరిన్ని ఆంక్షలు

దిల్లీ: సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాకిస్థాన్‌ను దెబ్బతీసేందుకు భారత్ మరో నిర్ణయం తీసుకుంది. పొరుగు దేశంతో వాణిజ్య సంబంధాలను తెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. పాక్ నుంచి ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై నిషేధం విధిస్తూ 'విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్' (డీజీఎఫ్‌టీ) కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిషేధం వెంటనే అమల్లోకి వస్తుందని పేర్కొంది. జాతీయ భద్రత, ప్రజా విధానం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ నిషేధానికి ఏదైనా మినహాయింపులు కావాలంటే ప్రభుత్వ ఆమోదం తప్పనిసరని, తదుపరి ఆదేశాలిచ్చేవరకు ఆ నిర్ణయం అమల్లో ఉంటుందని పేర్కొంది. 2019లో పుల్వామా ఉగ్రదాడి తర్వాత పాక్ దిగుమతులపై 200% సుంకాన్ని కేంద్రం విధించింది. దాంతో అవి చాలావరకు తగ్గిపోయాయి. ఇతర దేశాల మీదుగా పాక్‌నుంచి వచ్చే దిగుమతుల్నీ ఇప్పుడు నిలిపివేశారు. పాకిస్థాన్ నుంచి భారత్‌కు వివిధ మార్గాల్లో వచ్చే అన్నిరకాల ఉత్తరాలు, పార్సిళ్ల రవాణాను కూడా నిలిపివేస్తున్నట్లు తపాలా శాఖ ప్రకటించింది. అన్ని ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై ప్రభుత్వం నిషేధం విధించిన అనంతరం ఈ నిర్ణయాన్ని వెల్లడించింది. పాక్ నౌకలను భారత్‌లోని ఓడరేవుల్లోకి అనుమతించకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. భారతదేశ నౌకలు కూడా పాక్‌లోని రేవులకు వెళ్లడానికి వీల్లేదని 'డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్' (డీజీఎస్) ఆంక్షలు విధించారు. ఇవి తక్షణం అమల్లోకి వస్తాయని విడిగా విడుదలైన నోటిఫికేషన్ తెలిపింది. అరేబియా సముద్రంలో భారత నౌకాదళం యుద్ధవిన్యాసాలు చేస్తున్న దృష్ట్యా ఆ ప్రాంతంలోకి వెళ్లొద్దని వాణిజ్య నౌకలకు సూచనలు జారీ అయ్యాయి.

**మొత్తం వాణిజ్యంలో 0.1 శాతమే**

కొన్ని రకాల ఔషధ ఉత్పత్తులు, పండ్లు, సేంద్రియ రసాయనాలు, ప్లాస్టిక్స్, నూనె ఉత్పత్తులు, కొన్నిరకాల పిండి పదార్థాలు, బంక, హిమాలయన్ పింక్‌సాల్ట్, మసాలాదినుసుల వంటివి పాక్ నుంచి భారత్ దిగుమతి చేసుకునే వస్తువుల్లో ఉన్నాయి. వీటి విలువ తక్కువే. 202425లో భారత్ నుంచి పాక్‌కు 44.76 కోట్ల డాలర్ల వస్తువులు ఎగుమతి కాగా.. అక్కడి నుంచి కేవలం 4.2 లక్షల డాలర్ల ఉత్పత్తులనే దిగుమతి చేసుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా భారత్ జరుపుతున్న వాణిజ్యంలో ఇది 0.1 శాతం. విలువ స్వల్పమే అయినప్పటికీ పాక్‌లో కొన్ని పరిశ్రమలు భారత్‌కు ఎగుమతులపైనే ఆధారపడుతున్నాయి.

# జర్నలిస్టులకు మేలు జరిగేది టీయూడబ్ల్యూజే తోనే

* **జర్నలిస్టుల సంక్షేమం కోసం పోరాడే శక్తి టీయూడబ్ల్యూజే కే ఉంది**
* **రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ**

ఎల్బి నగర్, (ప్రజాస్ఫూర్తి) : జర్నలిస్టుల పక్షపాతిగా నిలబడి,వారి సంక్షేమం కోసం నిస్వార్థంగా పోరాడే శక్తి కేవలం తమ సంఘానికే ఉందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజెఐజేయు) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ అన్నారు. రంగారెడ్డి జిల్లా టీయూడబ్ల్యూజెఐజేయు మొదటి కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు ఎండి సలీమ్ పాషా అధ్యక్షతన ఎల్ బీ నగర్ లో శనివారం జరిగింది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి తో కలిసి విరహత్ అలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విరహత్ అలీ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతి పెద్ద జర్నలిస్టుల సంఘంగా టీయూడబ్ల్యూజే నిరంతరం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని స్పష్టం చేశారు. గత 65 యేండ్ల నుండి జర్నలిస్టులకు మేలు చేస్తుండడం వల్లే ఈ సంఘాన్ని విశ్వసిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.



రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లాలో యూనియన్ బలోపేతంగా ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులు పొందుతున్న సౌకర్యాలన్నీ ఉమ్మడి రాష్ట్రంలో తమ సంఘం సాధించినవేనని, గత పదేళ్ల కాలంలో జర్నలిస్టులకు ఆశించిన ప్రయోజనాలేమి లేవని విరాహత్ అలీ విచారం వ్యక్తం చేశారు. ఓ వైపు మీడియా సంస్థలకు బాసటగా నిలిచి,మీడియా స్వేచ్ఛను పరిరక్షిస్తూనే, మరోవైపు జర్నలిస్టుల గొంతుకగా నిలబడి, వారి హక్కుల సాధనకై నిరంతరం పోరాటాలు చేస్తున్నామని ఆయన తెలిపారు. నాటి నుండి నేటి వరకు తమ సంఘం ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా పనిచేయలేదని, ఏ ప్రభుత్వానికి వత్తాసు పలకలేదన్నారు. జర్నలిస్టుల సంక్షేమమే ఏకైక లక్ష్యంగా గల్లీ నుండి ఢిల్లీ వరకు పోరాడుతుందన్నారు. నేడు ప్రజల్లో మీడియా పట్ల విశ్వాసం సన్నగిల్లిపోవడానికి కారణాలను విశ్లేషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దీనిపై తమ సంఘం ప్రత్యేక దృష్టిసారించినట్లు విరాహత్ అలీ స్పష్టం చేశారు. పవిత్రమైన జర్నలిజం వృత్తిని అపవిత్రం చేసే శక్తులకు తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు.అక్రిడేషన్ కార్డులు మరోసారి పొడిగింపు ఉండదని, జూన్ నెలలో ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు.కోర్టు కేసుల వల్ల కొంత సమయం పట్టిందని, కమిటీ వేసి ప్రభుత్వానికి రిపోర్టు ఇచ్చినట్లు త్వరలో జిల్లా, రాష్ట్ర స్థాయి అక్రిడేషన్ కమిటీ లు వేయనున్నట్లు విరహత్ అలీ పేర్కొన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ విలువలతో కూడిన జర్నలిజాన్ని తమ సంఘం ప్రోత్సహిస్తుందన్నారు. తమ సంఘానికి ఉన్న సుదీర్ఘ పోరాటాల చరిత్ర, హక్కుల సాధనతోనే రాష్ట్రంలో వేలాది జర్నలిస్టుల విశ్వాసాన్ని, అదరాభిమానాల్ని చూరగొంటున్నట్లు ఆయన తెలిపారు..సమస్యల పరిష్కారం కోసం త్వరలో జిల్లా ఇంచార్జ్ మంత్రి,అధికార,ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా మాట్లాడుతూ జిల్లాలో గత పదేళ్లుగా 5 లక్షల ప్రత్యేక భీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో జర్నలిస్టులకు హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి దశల వారిగా ఉద్యమిస్తాం అన్నారు.ఈ సందర్భంగా విరహత్ అలీ చేతులమీదుగా 5 లక్షల భీమా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ మాట్లాడుతూ త్వరలో ఎల్ బి నగర్ లో జర్నలిస్టులకు మాస్టర్ హెల్త్ చెకప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు.ఈ సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు శ్రీశైలం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాధ కిషన్,మాజీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్,భాస్కర్,దుపమ్ ప్రసాద్,శశి పాల్,మధు కుమార్,షకీల్,ప్రణయ్ ముదిరాజ్, సత్యనారాయణ, నరసింహా రావు,సురేందర్,సుభాష్ రెడ్డి,శేఖర్,ఆంజనేయులు,కృష్ణ,కరుణాకర్, పాండు యాదవ్,దర్శనం జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల్లో క్రమశిక్షణ కు విబిఎస్ ఉపయోగపడుతుంది

* **పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఊట్ల చంద్ర రెడ్డి**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : పిల్లల్లో క్రమశిక్షణ కు విబిఎస్ ఎంతగానో ఉపయోగపడుతుందని పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఊట్ల చంద్ర రెడ్డి అన్నారు. కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ లోని ఫిలడెల్ఫియా ప్రార్థన మందిరంలో పది రోజుల పాటు వి.బి.ఎస్ , సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన ర్యాలీలో పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఊట్ల చంద్ర రెడ్డి పాల్గొని మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, మంచి క్రమశిక్షణ, మంచి అలవాట్లు, దేవుని యందు భక్తి, తల్లిదండ్రులకు విధేయత, సమాజానికి మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చేటువంటి విద్యార్థులుగా మంచి క్రమం నేర్చుకోవడానికి విబిఎస్ ఎంతగానో ఉపయోగపడుతుందని పిల్లలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ కాపరి పాస్టర్ సల్మాన్ , నాయకులు తెట్టెబావి ఆనంద్, సంఘ పెద్దలు ఇజ్రాయిల్, రాజ్ కుమార్, బాలకృష్ణారెడ్డి, ప్రసంగి, ప్రేమయ్య, దయాకర్, కోర్నేలు, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## బాటసారుల దాహర్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం

* **బిజెపి రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్**




శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : బాటసారుల దాహర్తీని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడుతాయని బిజెపి రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలో కళామందిర్ బస్ స్టాప్ లో వీరూ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు హైదర్ నగర్ డివిజన్ ప్రెసిడెంట్ వివేకానంద నగర్ డివిజన్ ప్రెసిడెంట్ , కంటెస్టెంట్ కార్పొరేటర్లు , యువ మోర్చా నాయకులు ఎస్సీ మోర్చా నాయకులు, మహిళా మోర్చా నాయకులు , బీజేపీ సీనియర్ లీడర్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నటువంటి ప్రతి ఒక్కరికి పేరుపేరునా నా ధన్యవాదాలు తెలియజేశారు.

## అధికారిపై దాడి.. భాజపా కార్పొరేటర్‌పై కేసు నమోదు

హైదరాబాద్: భాజపాకి చెందిన కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్‌పై అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారిపై రాకేశ్ జైస్వాల్ దాడి చేయడంతో.. ఆయనపై బీఎన్ఎస్ యాక్ట్ 132, 352 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించి, దాడికి పాల్పడ్డారని కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ స్పందించారు. అధికారులపై దాడులు చేస్తే సహించబోమన్నారు. అధికారులను పిలిచి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు

## ప్రధాని మోదీ.. తీసుకున్న కుల గణన నిర్ణయం చారిత్రాత్మకం

* **రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ రచ్చ శీను**




యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకున్న కుల గణన నిర్ణయం చరిత్రాత్మకమైందని రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ రచ్చ శ్రీనివాస్ అన్నారు. కుల గణన నిర్ణయానికి భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పాలాభిషేక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రధాని నరేంద్ర మోడి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ నిర్ణయం వల్ల సామాజిక న్యాయం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ లో కుల గణన తప్పుల తడక అని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని బూటకపు మాటలు మానుకోవాలని వారు హెచ్చరించారు. అన్ని సామాజిక వర్గాలకు సమాన న్యాయం జరుగుతుంది అని వారికి కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ నాయకులతో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, జిల్లా కౌన్సిల్ నెంబర్ ఆకుల చంద్రమౌళి, యాదగిరిగుట్ట పట్టణ బిజెపి ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి భానుచందర్ గౌడ్, పట్టణ కార్యదర్శి దొమ్మాట ప్రభాకర్, యాదగిరిగుట్ట పట్టణ బీజేవైఎం అధ్యక్షులు బోడ బుచ్చిబాబు, ఓబీసీ మోర్చా అధ్యక్షులు మందోజు నరేష్, సీనియర్ నాయకులు భోంగిరి శ్యామ్ సుందర్ , బెలిదే అశోక్ ,లెంకలపల్లి శ్రీనివాస్, ఎరుకల చైతన్య గౌడ్ ,ఆలేటి కర్ణ , ఆవుల సత్యనారాయణ ,బీజేవైఎం ప్రధాన కార్యదర్శి పలుగుల సురేష్,ఆకుల దేవేందర్, పట్టణ ఓబిసి శివరాత్రి శ్రీశైలం ,నల్ల వాసుదేవ రెడ్డి ,కాలూరి విజయ్ ,శివరాత్రి వంశీ ,పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసి పట్టేందుకే ఇంకుడు గుంతలు

* **జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్.**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: బూర్గంపాడు తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ఆవరణలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పలుగు పారా పట్టి ఇంకుడు గుంత తవ్వారు. శనివారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ బూర్గంపాడు మండలం బూర్గంపాడులో గల తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా జల్ సంచెయ్ జెన్ భాగీ దారి లో ప్రతి ప్రభుత్వ కార్యాలయం, వసతి గృహాలు, ఆసుపత్రులు, పాఠశాలల ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని చెప్పడమే కాకుండా వెంటనే పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణానికి పలుగు పారా పట్టి స్వయంగా కలెక్టర్ ఇంకుడు గుంతని తవ్వడం ప్రారంభించారు కలెక్టర్ వెంట ఉన్న స్థానిక సంస్థలు కలెక్టర్ విద్యా చందన , అధికారులు తట్టలతో మట్టి ఎత్తిపోశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇంకుడు గుంతల నిర్మాణానికి వేసవినే మంచి తరుణం అని, ఈ కాలంలో తవ్వకుంటే.. వర్షాకాలం నాటికి నీటిని భూమిలోకి ఇంకించవచ్చు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ పట్టణాలు, గ్రామాల్లో ఇంట్లో ఇంకుడుగుంత తవ్వుకుంటే మంచిది అని అన్నారు. ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసిపట్టాలంటే ఇంకుడు గుంత తప్పని సరిగా నిర్మించాలి అన్నారు. ఇంకుడు గుంత యొక్క కొలతలు ఒకటి మీటర్ వెడల్పు ఒక మీటర్ పొడవు ఒక మీటర్ లోతు తో ఒక గుంటను తీసి అందులో అందుబాటులో దొరికే శిథిలాల వ్యర్థాలు , చిన్న చిన్న రాళ్ళను నింపితే సరిపోతుందన్నారు. పాఠశాల ప్రాంగణం అంత పరిశీలించి పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, పాఠశాల భవనం ఎక్కడైనా లీకేజీ ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఒక డార్మెటరీ హాలు , రెండు తరగతి గదులు జన్మించడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సిపిఓ సంజీవరావు ను ఆదేశించారు. ఇంకా ఏమైనా పాఠశాలల్లో చేయవలసిన మరమత్తులు, పరిష్కరించాల్సిన సమస్యలను నివేదిక అందించాలని పాఠశాల తరపున ప్రారంభం నాటికి అన్ని సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పదవ తరగతి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించినందుకు గాను ప్రిన్సిపల్ గీత జ్యోతి నీ కలెక్టర్ అభినందించారు. బూర్గంపాడు మండల పర్యటనలో భాగంగా తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజ్, మొరంపల్లి బంజర లోని పీహెచ్ సెంటర్, నాగినేని ప్రోలు లోని హై స్కూల్ మరియు అంగన్వాడీ సెంటర్లను కలెక్టర్ స్వయంగా పలుగు, పారా పట్టి ఇంకుడు గుంతను తవ్వి అందరిని ప్రోత్సాహించారు .అనంతరం కలక్టర్ నాగినేనిప్రోలు పంచాయతీలోని నర్సరీని పరిశీలించి , లక్ష్మీపురంలోని ఉపాధి హామీ ద్వారా మునగ సాగును కూడా పరిశీలించి చాలా బాగుందని మెచ్చుకున్నారు. సారపాక లోని పాఠశాల పిల్లల ఏకరూప దుస్తుల తయారీ కేంద్రం ని పరిశీలించి మే నెల చివరి నాటికి ఏకరూప దుస్తుల తయారీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి , ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాలలో అభ్యర్థులకు సులువుగా తెలిసేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి

* **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం**



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : పరీక్షా కేంద్రాలలో అభ్యర్థులకు సులువుగా తెలిసేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం అధికారులకు సూచించారు. శనివారం కూకట్ పల్లిలోని జెఎన్ టియు కాలేజీలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టరు గౌతం తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలించి ఎగ్జామ్ సెంటర్లోకి పంపాలన్నారు. ప్రతి పరీక్షా హాలులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. పార్కింగ్ ఏర్పాటు చేసి , మెడికల్ కిట్లు, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైన ఏర్పాట్లన్ని సజావుగా పూర్తి చేసారా అని కలెక్టరు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెఎన్ టియు వైస్ ప్రిన్సిపల్ పద్మజ. అధికారులు, ఆర్డీవో శ్యాంప్రకాష్ పోలీసు అధికారులు, పరీక్షా కేంద్రాలకు డ్యూటీ మేజిస్ట్రేట్లుగా నియమించిన కూకట్ పల్లి, దుండిగల్, బాలానగర్, మూడుచింతలపల్లి, ఘట్కేసర్ , మల్కాజిగిరి తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు

## ప్రత్యేక అధికారుల పాలనలో ఇబ్బందులుపడుతున్న ప్రజలు

* **టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్**



రాజాపేట, ప్రజాస్ఫూర్తి : స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడంతో ప్రజా ప్రతినిధులు లేకపోవడం కారణంగా ప్రత్యేక అధి కారుల పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతూ సమస్యల మధ్య జీవనం కొనసాగిస్తున్నారని టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎస్. సి. జిల్లా నాయకులు, నది జలాల సాధన సమితి కన్వీనర్ ఎర్రకోకుల జస్వంత్, బుడిగ జంగాల జిల్లా అధ్యక్షులు చింతల రాజు తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల కనీస అవసరాలు కూడా తీరడం లేదని రోజురోజుకు సమస్యలు పెరుగుతున్నాయని తాగునీటి సమస్య పరిష్కారం జరగడంలేదని అన్నారు. పారిశుద్ధ్యం, గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు ఎదురవుతున్న చిన్నచిన్న సమస్యలు పరిష్కారం కావడం లేదని గ్రామపంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు చొరవ చూపడం లేదన్నారు. ఎర్ర గోకుల జస్వంత్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని, ఇప్పటికే పలు కారణాలవల్ల తక్కువ దిగుబడి ఎక్కువ పెట్టుబడి రైతులకు శాతంగా మారిందని మధ్య దళారీలు రైస్ మిల్లులకు నేరుగా ధాన్యం విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

## రేవంత్‌రెడ్డి 42 సార్లు దిల్లీ వెళ్లినా ఉపాధి పని దినాలు సగం తగ్గాయి : హరీశ్‌రావు

హైదరాబాద్: ఉపాధి హామీ పనిదినాలు 202425 సంవత్సరానికి 12.22 కోట్ల నుంచి 6.5 కోట్లకు తగ్గాయని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు (Harish Rao) అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి (Revanth Reddy) 42 సార్లు దిల్లీ వెళ్లినా ఉపాధి పనిదినాలు సగం తగ్గాయని విమర్శించారు. విషయం తెలిసినా కాంగ్రెస్, భాజపా ఎంపీలు మౌనంగా ఉన్నారని మండిపడ్డారు.

# గోదావరి జలాల సాధన కోసం పోరాటం ఉధృతం చేస్తాం

*** మాజీ ఎమ్మెల్యే సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాల సాధన కోసం పోరాటం ఉధృతం చేస్తామని మాజీ ఎమ్మెల్యే సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి తెలిపారు, శనివారం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లా రైతాంగానికి సాగునీరు అందించాలని,పాత డిజైన్ ప్రకారం ప్రాజెక్టు నిర్మించాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం పాతబస్ డిపో నుంచి పద్మశాలి కళ్యాణ మండపం వరకు వందలాది మందితో భారీ ప్రదర్శన నిర్వహించారు, అనంతరం మచ్చ వేంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన జిల్లా సదస్సు లో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి జిల్లా రైతాంగానికి



అన్యాయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రాజెక్టు కోసం సాగు భూములు ఇచ్చిన రైతులకే సాగునీరు ఇవ్వకుండా చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. ప్రాజెక్టు డిజైన్లు ఎవరి ప్రయోజనం కోసం మారుస్తున్నారని ప్రశ్నించారు. మంత్రి భూములకోసం జిల్లా రైతాంగానికి అన్యాయం చేస్తారా అని ప్రశ్నించారు. డిజైన్ మార్చడం వల్ల జిల్లాలో నిర్మించ తలపెట్టిన రిజర్వాయర్లు లేకుండా పోయాయని ఇది జిల్లా ప్రజలకు చేసిన తీవ్ర అన్యాయమని అన్నారు, ముఖ్యమంత్రి స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి పాత డిజైన్ ప్రకారం ప్రాజెక్టు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

**రీడిజైన్లు ఎవరి ప్రయోజనం కోసం**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్**

కొత్తగూడెం జిల్లాకు అన్యాయం జరుగుతుంటే జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు స్పందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాల సాధన కోసం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే, ఎంపీ తమ్మినేని వీరభద్రం నాయకత్వంలో మహాప్రస్థానం పాదయాత్ర వందరోజులు 2600కి,, మీ చేశామని,పోతినేని సుదర్శన్ నాయకత్వంలో మహారైతు పాదయాత్ర చేశామని తెలిపారు,తలాపునే గోదావరి పోతుంటే జిల్లా రైతులు సాగు నీరు లేక అవస్థలు పడుతున్నారని సిపిఎం సాగునీటి ప్రాజెక్టుల కోసం పోరాటం చేసిందని అన్నారు,సీతారామ ప్రాజెక్టు వచ్చిందని సంతోషపడ్డ ప్రజలకు మిగిలింది విషాదమేనని అన్నారు,డిజైన్ మార్చి గోదావరి జలాలను తరలించుకుపోతుంటే చూస్తూ ఊరుకోవద్దని సాగునీటి సాధనకు మరో ఉద్యమం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య,ఎ జె రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, కారం పుల్లయ్య, లిక్కి బాలరాజు,అన్నవరపు సత్యనారాయణ,రేపాకుల శ్రీనివాస్ , జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ,కొండపల్లి శ్రీదర్, ఎస్ ఏ నబి, గడ్డం స్వామి,నిమ్మల వేంకన్న,భూక్యా రమేష్,కొండబోయిన వెంకటేశ్వర్లు, ముదిగొండ రాంబాబు,యాసా నరేష్,సత్రపల్లి సాంబశివరావు,మోరంపూడీ శ్రీనివాసరావు,మండల కార్యదర్శులు కొమరం కాంతారావు,ఆలేటి కిరణ్, ఈసం నర్సింహారావు,పాకాల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## దాడికి పాల్పడిన విహెచ్‌పి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలి

**- బేడ బుడగ జంగం జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు, కోశాధికారి డొక్కా రాజేష్**





ముస్తాబాద్, ప్రజాస్ఫూర్తి: చేర్యాల మండలం వేచిరేని గ్రామంలో నివాసముండే బేడ బుడగ జంగాలకు చెందిన యువకునిపై పాల్పడిన విహెచ్‌పి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని బేడ బుడగ జంగం జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు, కోశాధికారి డొక్కా రాజేష్ డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌లో ఎసిపిని వారు శనివారం కలిసి దాడికి పాల్పడ్డ నిందితులను పట్టుకొని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేచిరేని గ్రామంలో ఉన్న ఆంజనేయ స్వామి గుడిని ధ్వంసం చేశాడన్న నెపంతో అజయ్ కుమార్ బట్టలు ఊడదీసి, చేతులు కట్టేసి నడిరోడ్డు పైన దారుణంగా కొట్టుకుంటూ ఊరేగించారని, ఒకవేళ అతను తప్పు చేసినట్టయితే పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాలే గాని ఇలా చట్టాన్ని చేతిలోకి తీసుకొని విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ వారు ఈ దారుణంగా కొట్టడాన్ని తీవ్రంగా ఖండిరచారు. అజయ్ కుమార్‌ను చితకబాదిన అందరిపై కేసు నమోదు చేయాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరి రవి, వానరాసి శేఖర్, పర్వతం తిరుపతి, సిరిపాటి శ్రీనాథ్, పర్వతం రాములు. నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం దిగుబడిలో దేశంలోనే తెలంగాణ టాప్

**: మంత్రి ఉత్తమ్**



హనుమకొండ: ధాన్యం దిగుబడిలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న సానుకూల వైఖరికి ధాన్యం దిగుబడే నిదర్శమని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నీటిపారుదల, పౌరసరఫరాల శాఖలపై హనుమకొండ కలెక్టరేట్ లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీని చరిత్రాత్మక అంశంగా పేర్కొన్నారు. సన్నబియ్యం పంపిణీకి మించిన సంక్షేమ పథకం మరొకటి లేదన్నారు. అర్హులైన పేదలందరికీ ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక నీటిపారుదల శాఖను ప్రక్షాళన చేస్తున్నట్లు తెలిపారు. ఈ శాఖలోని అన్ని సమస్యలను రెండేళ్లలో అధిగమిస్తామన్నారు. సీతమ్మసాగర్‌కు 68 టీఎంసీల గోదావరి జలాలు కేటాయించామన్నారు. కేంద్రంతో అనేక సార్లు చర్చించి నీటి వాటాను దక్కించుకున్నట్లు ఉత్తమ్ తెలిపారు.

## మంత్రి పొంగులేటి ప్రకటన బాధాకరం

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వం గందరగోవల ప్రకటనలు చేస్తుండడం బాధాకరమని సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల సర్వేలు ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 అంటూ మూడు విభాగాలు చేయడం ఆ విభాగాల లో విడుదలవారీగా ఇస్తామని గతంలో ప్రకటించారు కానీ మరల ఎంపికలు జరిగేటప్పుడు ఎల్ వన్ ,ఎల్ టు, ఎల్ త్రీ లో ఎక్కడ ఉన్న ఇండ్లు మంజూరు చేయాలి అంటూ ప్రకటించడం హాస్యాస్పదమని ఆయన అన్నారు. అంతేకాకుండా గతంలో ప్రభుత్వం ఐదు లక్షలు ఇంటి నిర్మాణానికి ఇస్తుంది మీరు ఎంత పెద్ద ఇల్లు అయినా అదనంగా డబ్బులు వేసుకొని నిర్మించుకోవచ్చని రాష్ట్ర ముఖ్యమంత్రి అనేకసార్లు



ప్రకటించి ప్రస్తుతం 600 గజాలు ఉండాలి 700 గజాలు ఉండాలి అంతలోనే నిర్మించాలంటూ లబ్ధిదారులను ప్రజలను గందరగోళం పరుస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వం రోజుకో ప్రకటన చేస్తుండడంతో అధికారులు సైతం ఏం చేయలేని పరిస్థితుల్లోకి నెట్టివేయబడుతున్నారని రేపు అవినీతి అక్రమాలు జరిగితే అధికారులే బాధ్యత వహిస్తారని ఇటు లబ్ధిదారులు అటు ప్రభుత్వం ప్రకటిస్తుండడం ప్రభుత్వం త్యాపకు ఒక మాట మాట్లాడుతుండడంతో మధ్యలో అధికారులు బలయ్యే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వమే ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఎల్ వన్ లో నిరుపేదలకు ఇవ్వలేకపోతుండడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ఒక స్పష్టమైన వైఖరి ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాలకు కేవలం 500 ఇండ్లు కాదని ఎల్ 1 ఎంతమంది ఎంపిక చేయబడితే అంతమందికి ఇవ్వాలని ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.జిల్లా కేంద్రమైన కొత్తగూడెం 36 వార్డులకు వార్డుకు 25 చొప్పున 2500 ఇండ్లు ఇవ్వాలని ఉమ్మడి జిల్లా మంత్రి పొంగులేటి కొత్త గూడానికి ప్రత్యేక ప్రాధాన్యతతో ఇండ్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా మంత్రి గృహ నిర్మాణ మంత్రి పొంగులేటి రోజుకో మాట చెప్తుండడం సరైంది కాదని ఆయన పేర్కొన్నారు.



## రెజ్లింగ్ వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

*** డి.వై.ఎస్.ఓ. పరంధామ రెడ్డి**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఇక్కడి 3 ఇంక్లైన్ లోని తెలంగాణ క్రీడ మైదానం నందు ఏర్పాటుచేసిన రెజ్లింగ్ వేసవి శిక్షణ శిబిరాన్ని శనివారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా క్రీడా అధికారి ఎం. పరంధామ రెడ్డి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జి.యుగంధర్ రెడ్డి,లు పాల్గొని శిక్షణ శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు.ఈ శిబిరంలో పరిసర ప్రాంతాలకు చెందిన50 మంది బాల,బాలికలు ఉత్సాహంతో పాల్గొన్నారు ఈ సందర్భంగా వారి ఉద్దేశించి జిల్లా క్రీడా అధికారి ఎం. పరంధామ రెడ్డి మాట్లాడుతూ బాల,బాలికలంతా వేసవి సెలవులను వృధా చేసుకోకుండా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొని ఆరోగ్యం ,మానసిక ఉల్లాసం ,ఏకగ్రతతో పాటు , క్రమశిక్షణ తో క్రీడాకారులుగా ఎదిగే అవకాశం ఉంది క్రీడాకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కలెక్టర్ కల్పిస్తున్నారు కాబట్టి అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జి.యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ శిక్షణ శిబిరంలో అందరూ పాల్గొని మంచి క్రీడాకారులుగా ఎదిగి ప్రభుత్వం కల్పిస్తున్న క్రీడా రిజర్వేషన్ ని పొంది మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి. రెజ్లింగ్ వేసవి శిక్షణ శిబిరం ఇంచార్జ్ పి.కాశీ హుస్సేన్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో టి.పి.సి.సి సభ్యులు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నాగ సీతారాములు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ కే.మహిదర్ జిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్షులు ఐ.ఆదినారాయణ, క్రీడా సంఘాల ప్రతినిధులు ఎం .రమేష్, జి.కృష్ణ, బి.బుచ్చయ్య, బాలకృష్ణ, పి.నాగేందర్ పలువురు కోచ్ లు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## వెయ్యి ఎకరాల్లో ఎలక్ట్రానిక్ సిటీ: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబుతో తైవాన్‌కు చెందిన సిరా నెట్‌వర్క్స ప్రతినిధులు భేటీ అయ్యారు. ఎల్‌సీజీసీ రెజెల్యూట్ సంస్థతో కలిసి సిరా నెట్‌వర్క్స రూ.300 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. భేటీ అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీలో వెయ్యి ఎకరాల్లో ఎలక్ట్రానిక్ సిటీని అభివృద్ధి చేస్తామని అన్నారు. ఎలక్ట్రానిక్ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పారిశ్రామికవేత్తలకు ఇబ్బంది కలగకుండా అధికారులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో పెట్టుబడి పెట్టే వాళ్లకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. ప్రాంతాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. 10 ఎకరాల్లో ఎలక్ట్రానిక్ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు సిరా నెట్‌వర్క్ అంగీకారం తెలిపిందని శ్రీధర్‌బాబు వెల్లడించారు. దీనివల్ల 2,500 మందికి ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు.



## ఘనంగా ఐఎన్టీయూసి 78వ ఆవిర్భవ దినోత్సవం



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : ఐఎన్టీయూసి 78వ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా ఐఎన్టీయూసి జాతీయ అధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి ఆదేశాల మేరకు శనివారం నారాయణగూడ లోని ఐఎన్టీయూసి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ ఐఎన్టీయూసి జాతీయ ఉపాధ్యక్షులు జి. సత్యజిత్ రెడ్డి హాజరై ఐఎన్టీయూసి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కనీస వేతనాల , సలహా మండలి బోర్డ్ చైర్మన్, జన ప్రసాద్ , ఐఎన్టీయూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్.డి. చంద్రశేఖర్, వి. భాస్కర్ రెడ్డి,ఐఎన్టీయూసి రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ యాదవ్, తెలంగాణ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కార్యదర్శులు పూసల తిరుపతి, బంగారి పర్వతాలు, ట్రాన్స్పోర్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి గోదా మల్లేష్ గౌడ్, ఐఎన్టీయూసి ఆర్టీసీ యూనియన్ నాయకులు అబ్రహం,ఐఎన్టీయూసి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బోరింగ్ శ్రీనివాస్, ఐఎన్టీయూసి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, ఐఎన్టీయూసి కర్నూల్ సిటీ అధ్యక్షులు గోవింద్, ఐఎన్టీయూసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎంగలి ప్రసాద్, ఐఎన్టీయూసి సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లకుంట రవీందర్, ఐఎన్టీయూసి నల్గొండ జిల్లా ఐఎన్టీయూసి నాయకులు వడ్డే బోయిన్ సైజులు, ఐఎన్టీయూసి భారత్ గ్యాస్ కంపెనీ ప్రధాన కార్యదర్శి, రవి, భారత్ గ్యాస్ కంపెనీ గోదాం, కోశాధికారి రాకేష్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు వేగంగా న్యాయం చేసి.. వారి అభిమానాన్ని పొందాలి

**: తెలంగాణ డీజీపీ**



హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు వేగంగా న్యాయం చేసి వారి అభిమానాన్ని పొందాలని ఇన్‌స్పెక్టర్లకు డీజీపీ జితేందర్ సూచించారు. పోలీస్ స్టేషన్లకు ప్రజలు వచ్చినప్పుడు వారికి న్యాయం జరిగేలా చూడాలని.. తద్వారా వారికి మిత్రులుగా మారుతారని అన్నారు. ప్రజలకు న్యాయం చేసినప్పుడు పోలీస్ అధికారులు మంచి పేరు తెచ్చుకోవడంతో పాటు ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని వివరించారు. పోలీసులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తే చెడ్డ పేరు కూడా వస్తుందనే విషయాన్ని పోలీసులు గుర్తుపెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని యూనిట్ల నుంచి వచ్చిన ఇన్‌స్పెక్టర్లతో డీజీపీ సమావేశమయ్యారు. ‘‘రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించనుంది. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు తమ తమ ప్రాంతాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసులు తమ శక్తి సామర్థ్యాలను చాటుకునే అవకాశం వచ్చింది. అందుకు అనుగుణంగా కృషి చేయాలి. పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ల పాత్ర ఎంతో కీలకం. దేశంలోనే ఉత్తమ పోలీస్ శాఖగా ఎంపికైన తెలంగాణలో పనిచేస్తున్న సిబ్బంది ఆ స్థాయిని నిలుపుకోవాలి. సాధించింది కొంత మాత్రమే.. చేయాల్సింది ఇంకా ఎంతో ఉంది అనేలా పోలీసులు పనిచేయాలి’’ అని డీజీపీ సూచించారు.

# భారత్ సమాచారంతో అలర్ట్.. కొలంబో ఎయిర్‌పోర్టులో భారీ సెర్చ్ ఆపరేషన్

పహల్గాం ఉగ్రదాడికి పాల్పడినవారి లక్ష్యంగా భద్రతా సిబ్బంది ముమ్మర గాలింపు చేపడుతున్నారు. ఈ తరుణంలో భారత్ ఇచ్చిన సమాచారం మేరకు శ్రీలంకలోని కొలంబో ఎయిర్‌పోర్ట్‌లో భారీ సెర్చ్ ఆపరేషన్ జరిగింది. ఆ ఉగ్రఘటనలో పాల్గొన్నారని భావిస్తున్న ఆరుగురు వ్యక్తులు చెన్నై నుంచి శ్రీలంక వెళ్లే విమానం ఎక్కి ఉండొచ్చని భారత ప్రభుత్వం అనుమానించడంతో ఈ తనిఖీలు జరిగాయి. శ్రీలంక ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం బండారునాయికే ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న తర్వాత ఆ ఆపరేషన్ జరిగింది. శ్రీలంక పోలీసులు, ఆ దేశ ఎయిర్‌ఫోర్స్, ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ విభాగం కలిసి ఆ తనిఖీలు నిర్వహించాయి. చెన్నై ఏరియా కంట్రోల్ సెంటర్ నుంచి తమకు అలర్ట్ వచ్చినట్లు విమానయాన సంస్థ వెల్లడించింది. అయితే ఎలాంటి అనుమానితుడిని గుర్తించకపోవడంతో తదుపరి కార్యకలాపాలకు అనుమతి ఇచ్చినట్లు తెలిపింది. పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఏప్రిల్ 22



ఘటన అనంతరం దర్యాప్తు బృందాలు టెర్రరిస్టులకు క్షేత్ర స్థాయిలో సహకరించిన ఓవర్ గ్రౌండ్ వర్కర్స్‌ను పెద్ద సంఖ్యలో అరెస్టు చేశాయి. వీరిలో ఒకరు చెప్పినదాని ప్రకారం.. ఉగ్రవాదులు ఏప్రిల్ 15వ తేదీనే పహల్గాంకు చేరుకున్నారు. ఆ తరవాత వారు నాలుగుచోట్ల రెక్కీలు నిర్వహించారు. వీటిలో బైసరన్ వ్యాలీ, అరు వ్యాలీ, స్థానిక అమ్యూజ్‌మెంట్ పార్క్, బేతాబ్ వ్యాలీ ఉన్నాయి. వీటిల్లో చాలాచోట్ల భద్రతా ఏర్పాట్లు ఉండటంతో వారు దాడులు చేయడానికి వెనుకంజ వేశారు. ఈ ఉగ్రవాదులకు క్షేత్రస్థాయిలో పలువురు సహకరించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) గుర్తించింది. వీరిలో చాలామందిని ఇప్పటికే అరెస్టు చేసింది. మిగిలిన వారు నిఘా నీడలో ఉన్నారు.

## రాజౌరీ ఉగ్రవాదులను ప్రశ్నిస్తున్న ఎన్ఐఏ




పహల్గాం ఉగ్రదాడి కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తును ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా పాత ఉగ్రవాదులను ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. 2023లో రాజౌరీలో దాడికి పాల్పడిన ఇద్దరు ఉగ్రవాదులను జమ్మూ జైలులో జాతీయ దర్యాప్తు సంస్థ ప్రశ్నిస్తూ.. సమాచారం సేకరిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రవాదులకు వీరితో సంబంధాలు ఉండి ఉంటాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. 2023 జనవరిలో రాజౌరీలోని ధంగ్రీ గ్రామంపై ఇద్దరు ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ ఘటనలో ఐదుగురు పౌరులు చనిపోగా.. పలువురు గాయపడ్డారు. ఈ దాడి సమయంలో అక్కడ ఉన్న ఓ ఇంటిలో ఐఈడీని దుండగులు అమర్చారు. మర్నాడు అది పేలి మరో ఇద్దరు చనిపోయారు. దీంతో ఉగ్రవాదులకు ఆశ్రయం ఇచ్చిన నిస్సార్ అహ్మద్, ముస్తాక్ హుస్సేన్ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిలో నిస్సార్ మాత్రం లష్కరే హ్యాండ్లర్ అబూ ఖతాల్ అలియాస్ ఖతాల్ సింధితో టచ్‌లో ఉంటూ.. ఇన్ఫార్మర్‌గా పనిచేసేవాడు. పహల్గాం ఉగ్రదాడిపై విచారణ చేస్తున్న ఎన్ఐఏ అధికారులు కీలక ఆధారాలు సేకరిస్తున్నారు. దాడి జరిగినప్పుడు ఘటనా స్థలంలో ఉన్న పర్యాటకులను, స్థానికులను ప్రశ్నిస్తున్నారు. అక్కడ వారు తీసుకున్న ఫొటోలు, వీడియోల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఉగ్రవాదులకు క్షేత్రస్థాయిలో దాదాపు 20 మంది సహకరించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) గుర్తించింది. వీరిలో చాలామందిని ఇప్పటికే అరెస్టు చేశారు. మిగిలినవారు నిఘా నీడలో ఉన్నారు. విచారణలో భాగంగా ఇప్పటివరకు మొత్తం 2,500 మందిని ప్రశ్నించామన్నారు. వీరిలో 186 మంది ఇప్పటికీ దర్యాప్తు బృందాల కస్టడీలో ఉన్నారు. దాడికి సంబంధించి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసేందుకు ఎన్ఐఏ అత్యాధునిక విధానాలు వినియోగిస్తోంది. శాటిలైట్ ఇమేజ్‌లు, డ్రోన్ దృశ్యాలు, బాధితులు, గుర్రపు స్వారీ ఆపరేటర్ల నుంచి సమాచారం సేకరిస్తోంది. దీంతోపాటు దాడి జరిగిన ప్రదేశాన్ని హైరిజల్యూషన్ 3డీ మోడల్‌ను కూడా తయారుచేస్తున్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలం నుంచి ఇప్పటివరకు 40 ఖాళీ తూటాలను దర్యాప్తు బృందాలు స్వాధీనం చేసుకొన్నాయి.

# పాక్‌పై భారత్ కఠిన చర్యలు..
## అన్ని రకాల మెయిల్స్, పార్సిళ్ల ఎక్స్ఛేంజీ నిలిపివేత



పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ పాకిస్థాన్‌పై దౌత్య, వాణిజ్య పరమైన పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా పాక్‌కు మరో షాక్ ఇచ్చింది. ఆ దేశం నుంచి వాయు, ఉపరితల మార్గాల ద్వారా భారత్‌కు వచ్చే అన్ని రకాల మెయిల్స్, పార్సిళ్ల ఎక్స్ఛేంజీ నిలిపివేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ దేశం నుంచి భారత్‌కు వచ్చే అన్ని ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై నిషేధం విధించిన అనంతరం ఈ నిర్ణయాన్ని వెల్లడించింది. మరోవైపు, పాకిస్థాన్‌తో సముద్ర రవాణా మార్గాలను భారత్ మూసివేసింది. ఆ దేశ జెండాతో ఉన్న ఓడలు భారత పోర్టుల్లోకి రాకుండా కేంద్రం నిషేధం విధించింది. ఈ ఆంక్షలు తక్షణమే అమల్లోకి వస్తాయని వెల్లడించింది. అటు భారత ఓడలు కూడా పాక్ పోర్టుల్లోకి వెళ్లకూడదని స్పష్టం చేసింది. ఇప్పటికే పాక్ విమానాలకు మన గగనతలాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. అంతే కాకుండా పాకిస్థాన్‌కు ఎలక్ట్రానిక్స్, ఈ కామర్స్ వస్తువుల ఎగుమతిని పరిమితం చేయాలని భారత్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. వాటిపై ఆంక్షలు విధించే దిశగా యోచన చేస్తున్నట్లు సమాచారం. పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడంతో భారత్ ఈ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా మొదట సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్‌ను విడిచివెళ్లాలని ఆదేశించింది. దాయాది దేశంపై ఆర్థిక దాడులకూ ప్రణాళికలు రచిస్తోంది. ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులోకి మళ్లీ పాకిస్థాన్‌ను తీసుకువచ్చేలా చేయడం అందులో ఒకటి కాగా.. పాకిస్థాన్‌కు సహాయ ప్యాకేజీ ప్రకటించిన అంతర్జాతీయ ద్రవ్య నిధిపై ఒత్తిడి పెంచడం మరొకటి. ఈ రెండింటిలో భారత్ విజయం సాధిస్తే.. అది పాకిస్థాన్‌కు శరాఘాతమే అవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

## పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో.. భారత నేవీ 'త్రిశూల శక్తి'



పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు భగ్గుమంటున్నాయి. ఈ నేపథ్యంలో భారత నౌకాదళం సముద్రంలో గస్తీ కాస్తున్న చిత్రాన్ని షేర్ చేసింది. అందులో ఒక నౌక, జలాంతర్గామి, హెలికాప్టర్ దర్శనమిచ్చాయి. అవి.. ఐఎన్ఎస్ కోల్‌కతా, ధ్రువ్ అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్, స్కార్పీన్ తరగతికి చెందిన జలాంతర్గామి. "భారత నేవీ త్రిశూల శక్తి.. సముద్రం పైన.. కింద.. అలల మీదుగా" అని అర్థం వచ్చేలా ఆ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చింది. 'Anytime Anywhere Anyhow' అనే హ్యాష్‌ట్యాగ్‌ను జోడించింది. ధ్రువ్ హెలికాప్టర్ కార్యకలాపాలను కొన్నినెలల క్రితం నిలిపేశారు. దీన్నిబట్టి చూస్తే.. ఇది పాతచిత్రం కావొచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం ఇది నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. ఉగ్ర ఘటన తర్వాత నుంచి భారత సైన్యం శక్తి సామర్థ్యాలను చాటిచెప్పే వీడియోలను సామాజిక మాధ్యమాల్లో అధికారులు షేర్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి వెనక "ది రెసిస్టెన్స్ ఫ్రంట్' హస్తం ఉన్నట్లు భద్రతా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఇది పాక్ కేంద్రంగా ఉన్న లష్కరే తోయిబాకు అనుబంధ సంస్థ. దీన్ని భారత ప్రభుత్వం గతంలోనే ఉగ్ర సంస్థగా ప్రకటించింది. ఇక ఈ ఘటన తర్వాత పాక్‌ నడ్డివిరిచేలా భారత ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. వాటిలో సింధూజలాల ఒప్పందం అమలు నిలిపివేత కూడా ఒకటి. ఇక, కొన్ని నెలల క్రితం నిలిపివేసిన అధునాతన తేలికపాటి హెలికాప్టర్ ధ్రువ్ కార్యకలాపాలను పునరుద్ధరించేందుకు ఇటీవల ప్రభుత్వం అనుమతిచ్చింది. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌లో వాటికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ.. నౌకాదళంలో ఉన్న ఈ హెలికాప్టర్లకు మాత్రం అనుమతివ్వలేదని తెలిసింది. అత్యంత అధునాతనమైన స్కార్పీన్ తరగతి జలాంతర్గాములు భారత నౌకాదళంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. ఇవి శత్రు యుద్ధనౌకలు, జలాంతర్గాముల వేట, నిఘా సమాచార సేకరణ, సాగరజలాల్లో మందుపాతరలు అమర్చడం, నిర్దిష్ట ప్రాంతంలో ప్రత్యర్థుల కదలికలపై కన్నేసి ఉంచడం వంటి కార్యకలాపాలు సాగించగలవు. ఫ్రాన్స్ తోడ్పాటుతో నిర్మించిన ఈ జలాంతర్గాములకు శత్రువుల నిఘా సాధనాలకు దొరకని రీతిలో అద్భుతమైన స్టెల్త్ లక్షణాలు ఉన్నాయి. టోర్పిడోలు, నౌకా విధ్వంసక క్షిపణులను ప్రయోగించగలవు. భారత నౌకాదళంలో ఐఎన్ఎస్ కోల్‌కతా ప్రధాన డెస్ట్రాయర్. ఇది భారత నౌకాదళానికి చెందిన శక్తివంతమైన యుద్ధ నౌకల్లో ఇది ఒకటి.

## ఆస్ట్రేలియా ప్రధానిగా ఆంథోనీ ఆల్బనీస్..
### వరుసగా రెండోసారి అధికారంలోకి

ఆస్ట్రేలియా ప్రధానిగా ఆంథోనీ ఆల్బనీస్ వరుసగా రెండోసారి విజయం సాధించారు. శనివారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఆల్బనీస్ నేతృత్వంలోని లేబర్ పార్టీ గెలుపొందింది. దీంతో 2004 తర్వాత వరుసగా అధికారంలోకి వచ్చిన తొలి ప్రధానిగా ఆయన రికార్డు సృష్టించారు. మరో మూడేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. ఈ క్రమంలోనే ప్రతిపక్ష నేత పీటర్ డట్టన్ ఎన్నికల్లో ఓటమిని అంగీకరించారు. తాము సరిగ్గా రాణించలేదని, ఫలితాల్లో ఈ విషయం స్పష్టమైందని చెప్పారు. ప్రతినిధుల సభలోని 150 స్థానాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఓట్ల లెక్కింపు క్రమంలో అధికార లేబర్ పార్టీ ఇప్పటికే 86 స్థానాల్లో విజయం సాధించి.. మెజార్టీ మార్కు (76) దాటేసింది. ద్రవ్యోల్బణం, ఇంధన విధానాలు, ఇళ్ల కొరత, వడ్డీ రేట్లలో పెరుగుదల వంటి సమస్యలే ప్రధాన అంశాలుగా ఎన్నికలు సాగాయి. ఓటింగ్ అనంతరం.. ఆల్బనీస్ సర్కారే మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశం ఉందనే అంచనాలు వెలువడ్డాయి. 2022 నుంచి ప్రధానిగా ఉన్న ఆయన.. మరో మూడేళ్లపాటు ఆ పదవిలో కొనసాగనున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత సమయంలో.. ఆస్ట్రేలియన్లు ఆశావాదం, దృఢ సంకల్పాన్ని ఎంచుకున్నారని తన విజయ ప్రసంగంలో ఆల్బనీస్ తెలిపారు.



**ప్రధాని మోదీ శుభాకాంక్షలు..**

వరుసగా రెండోసారి ఎన్నికైన ఆల్బనీస్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. "అఖండ విజయం సాధించి ఆస్ట్రేలియా ప్రధానిగా మరోసారి ఎన్నికైనందుకు అభినందనలు. ఈ తీర్పు మీ నాయకత్వంపై ఆస్ట్రేలియా ప్రజల విశ్వాసాన్ని సూచిస్తోంది. భారత్ ఆస్ట్రేలియాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునేందుకు, ఇండో పసిఫిక్‌లో శాంతి, స్థిరత్వం కోసం మన ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లేలా కలిసి పనిచేసేందుకు ఎదురు చూస్తున్నాను" అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

## రష్యా విక్టరీ డే వేడుకలు.. రాజ్‌నాథ్ కూడా వెళ్లకపోవచ్చు..

రష్యా నిర్వహించనున్న విక్టరీ డే వేడుకల్లో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా పాల్గొనకపోవచ్చని తెలుస్తోంది. రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేఠ్‌ను పంపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నట్లు కనిపిస్తోంది. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా విక్టరీ డే పేరుతో రష్యా ఏటా వేడుకలు జరుపుతుంది. మాస్కోలోని రెడ్ స్క్వేర్‌లో మే 9న భారీ స్థాయిలో సైనిక కవాతు నిర్వహిస్తారు. 80వ వార్షికోత్సవం సందర్భంగా ఈసారి మిత్ర దేశాధినేతలను పుతిన్ ఆహ్వానించారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి మోదీకి ఆహ్వానం అందింది. అయితే భారత్‌పాక్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ మాస్కో పర్యటనకు మోదీ వెళ్లడం లేదు. ఆయన రావట్లేదని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ వెల్లడించింది. ఆ తర్వాత రాజ్‌నాథ్ వెళ్తారని వార్తలు వచ్చినా, ఇప్పుడు ఆయన పర్యటన కూడా రద్దయినట్లు తెలుస్తోంది. కాగా, ఈ వేడుకల్లో పాల్గొననున్నట్లు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.



# మీ ఇంట్లో.. వాటర్ సాఫ్ట్‌నర్ ఉందా?





**నీలిమ వాళ్లు కొత్తగా ఇల్లు మారారు. అక్కడ సదుపాయాలన్నీ బాగున్నాయి కానీ... నీళ్లతోనే చిక్కంతా! ఆ నీళ్లతో తలస్నానం చేస్తుంటే, జుట్టు కుచ్చులుగా రాలిపోతోంది. ఇక బట్టలయితే ఎంత ఉతికినా, తెల్లగా మెరవడం లేదు. ఆరాతీస్తే... అక్కడి నీళ్లు 'హార్డ్ వాటర్' అంటున్నారు. ఇలాంటి హార్డ్ వాటర్ కష్టాల నుంచి ఉపశమనం కలిగించేందుకు వచ్చినవే ఈ 'వాటర్ సాఫ్ట్‌నర్స్'...**

తాగే నీళ్లు స్వచ్ఛంగా, శుభ్రంగా ఉండాలని ఎంతో ఖర్చు పెడుతుంటాం. ఖరీదైన వాటర్ ప్యూరిఫైయర్లు కొంటాం, అవి కొనలేనప్పుడు సాధారణ ఫిల్టర్లు కొనడమో, లేక బజారులో దొరికే మినరల్ వాటర్ బబుల్స్‌ని వేయించుకోవడమో చేస్తాం. తాగునీటి విషయంలో ఇంత శ్రద్ధ పెట్టే మనం... ఇంటి అవసరాలకోసం వాడే నీళ్ల విషయంలో మాత్రం రాజీ పడిపోతాం. 'ఇక్కడి నీళ్లు ఇంతేలే' అని సరిపెట్టుకుంటాం. కానీ ఈ హార్డ్ వాటర్‌తో వచ్చే చిక్కులు తక్కువేమీ కాదు. ఎంత శుభ్రంగా ఉంచుకున్నా బకెట్లలో తెల్లగా సున్నంలాంటి పదార్థం పేరుకుపోతుంది. ట్యాప్‌లపైన దళసరిగా గారపట్టేస్తుంది. గీజర్లూ, వాషింగ్‌మెషీన్లూ, డిష్‌వాషర్లలోనూ ఉప్పులాంటి తెల్లని పదార్థం పేరుకుపోయి, అవి పనిచేయకుండా మొరాయిస్తాయి. ఫలితంగా కరెంట్ బిల్లూ తడిసి మోపెడవుతుంది. ఇక తెలుపురంగు టైల్స్ కాస్తా మురికి రంగులోకి మారి చూడ్డానికి ఇల్లే పాతగా కనిపిస్తుంది. ఇవన్నీ ఒకెత్తయితే, ఈ నీళ్లతో తలస్నానం చేస్తుంటే జుట్టు రాలిపోతుంది, చర్మం పొడిబారిపోతుంది. బట్టల్ని ఎంత ఉతికినా నురుగూ, మెరుపూ రెండూ రావు. కొన్ని ప్రాంతాల్లో అయితే నీళ్లు ఒకరకం దుర్వాసన కూడా వస్తుంటాయి. ఇలా జరగడానికి ప్రధాన కారణం ఆ నీళ్లలో కాల్షియం, మెగ్నీషియం వంటి మినరల్స్ అధిక మోతాదులో ఉండటమే. నీళ్లనుంచి ఆ మినరల్స్‌ని తొలగించి, నీటిని మృదువుగా మార్చేందుకు వచ్చినవే 'వాటర్ సాఫ్ట్‌నర్స్'.

**అనారోగ్యాన్ని వడకట్టేస్తాయి...**

ఈ వాటర్ సాఫ్ట్‌నర్స్ లేదా కండిషనర్లలో విద్యుత్తుతో పనిచేసేవీ, విద్యుత్తు అవసరం లేనివీ, రసాయనాలు లేని హెర్బల్ లిక్విడ్‌లూ, సాల్ట్ ట్యాబ్లెట్స్... ఇలా వివిధ రకాల్లో దొరుకుతున్నాయి. మన ఇంటి అవసరాలని బట్టి వేటినైనా ఎంచుకోవచ్చు. వాటర్ బాటిళ్లూ, బంతి ఆకారంలో ఉండే సాఫ్ట్‌నర్లని ఉపయోగించు కోవడమూ తేలికే. వీటిని వాటర్ ట్యాంకుల్లో వేస్తే సరి. అవి నీటిలోని ఖనిజాలని గ్రహించి, నీటిని తేటగా మారుస్తాయి. దాంతో స్నానానికీ, పాత్రలు తోమడానికీ ఈ నీళ్లు బాగుంటాయి... నేలపైన గార పట్టకుండా ఉంటుంది. రెండు నెల్లకోసారి దానిలోని క్యాట్రిడ్జ్‌ని మారిస్తే సరిపోతుంది. షవర్లూ, కిచెన్‌లోని సింక్‌లూ, వాషింగ్‌మెషీన్లూ, గీజర్లకు విడిగా అమర్చుకునేలా కూడా సాఫ్ట్‌నర్లు అందుబాటులో ఉన్నాయి. ఆయా యంత్రాలకు నీళ్లని మళ్లించే పైపులకి ఈ సాఫ్ట్‌నర్లని అమర్చుకుంటేచాలు. స్నానం చేసే నీళ్లతో మాత్రమే ఇబ్బంది అనుకునేవారి కోసం ప్రత్యేకించి అరోమా, మాయిశ్చరైజర్, విటమిన్ ఫిల్టర్లు కూడా దొరుకుతున్నాయి. ఇవి నీటి గాఢతను తగ్గించడమే కాకుండా... మనసుకు ప్రశాంతతనిచ్చేలా నిమ్మ, గులాబీ, లావెండర్ వంటి పరిమళాలని అందిస్తున్నాయి. చర్మాన్ని మృదువుగా ఉంచేందుకు మాయిశ్చరైజర్లనీ, విటమిన్లనీ జత చేస్తున్నాయి. హార్డ్‌వాటర్ సమస్యలంటే కేవలం మినరల్స్‌తో మాత్రమే ఇబ్బంది ఉండదు. కొన్ని ప్రాంతాల్లో నీళ్లు రంగుమారిపోయి వస్తుంటాయి. ముఖ్యంగా ఈ వేసవికాలంలో నీటి కొరత ఉంటుంది కాబట్టి నీళ్లలో మట్టి ఎక్కువగా ఉంటుంది. కొన్ని రకాల నీళ్లలో బ్యాక్టీరియా కూడా ఉంటుంది... అందుకే ఆ నీళ్లు దుర్వాసన వస్తుంటాయి. మరికొన్ని రకాల నీళ్లలో క్లోరిన్, లెడ్, మైక్రోప్లాస్టిక్, భారలోహాలు వంటివి కూడా ఉంటాయి. ఈ సమస్యల నుంచి ఉపశమనం కలిగించడానికి విద్యుత్తుతో పనిచేసే ఏఐ స్మార్ట్ వాటర్ కండిషనర్లు వచ్చాయి. ఇవి సాధారణ సాఫ్ట్‌నర్లతో పోలిస్తే మట్టీ, బ్యాక్టీరియాలని వడకట్టేసి నీటిని మరింత నాణ్యంగా మారుస్తున్నాయి. వీటిల్లో మనకు తగిన సాఫ్ట్‌నర్లని ఎంచుకుని నీటి చిక్కుల నుంచి బయటపడదాం.









# లాఫింగ్ గ్యాస్‌తో కుంగుబాటు దూరం!



నైట్రస్ ఆక్సైడ్... దీన్నే లాఫింగ్ గ్యాస్ అని కూడా అంటారు. నూటయాభైఏళ్లుగా ఈ లాఫింగ్ గ్యాస్‌ని దంత వైద్యంలో నొప్పి నివారిణిగా వాడుతున్నారు. ఇప్పుడదే లాఫింగ్ గ్యాస్ తీవ్రమైన కుంగుబాటు నుంచి బయటపడటానికి మార్గం చూపిస్తోందని చెబుతున్నారు పెన్సిల్వేనియా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. కుంగుబాటుకి గురైన ప్రతి ముగ్గురిలో ఒకరికి థెరపీలూ, మందులూ కూడా పనిచేయడం లేదట. ఒకవేళ పనిచేసినా ఎక్కువ సమయం తీసుకుంటున్నాయి. కొన్ని కేసుల్లో అత్యవసరంగా వైద్యం అందించి కుంగుబాటు నుంచి బయటపడేయడానికి ఇతర మార్గాల కోసం అన్వేషిస్తున్న శాస్త్రవేత్తలకు లాఫింగ్ గ్యాస్ రూపంలో పరిష్కారం దొరికింది. డిప్రెషన్‌లో ఉన్న రోగులకి ఈ గ్యాస్‌ని అందించినప్పుడు అది మెదడులో అచేతనంగా ఉన్న ఎల్-5 న్యూరాన్లని చైతన్యవంతం చేయడం... కొన్ని ఏళ్లపాటూ డిప్రెషన్‌లో కూరుకుపోయిన వాళ్లు కూడా వేగంగా కోలుకోవడం చూశారు. కొంతమందిలో ఈ గ్యాస్ రెండువారాలపాటు సానుకూల ఫలితాలను అందించిందట. సో, ఈ గ్యాస్‌తో నోటి మాత్రలు రూపొందించి కుంగుబాటుకి చెక్ పెట్టొచ్చంటున్నారు శాస్త్రవేత్తలు.

# ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఆర్సీబీదే విజయం

### పోరాడి ఓడిన చెన్నై

**బెంగళూరు:** క్రికెట్ అభిమానులకు అసలు సిసలు మజా అందింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ క్రికెట్ అభిమానులను చివరి బంతి వరకు అలరించింది. చివరకు ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఆర్సీబీ గెలుపొందింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరింది. రెండు పరుగుల తేడాతో చెన్నైపై ఉత్కంఠభరిత విజయం సాధించింది. ప్లే ఆఫ్స్ అవకాశాలకు దూరమై ఈ సీజన్ ట్రోఫీకి దూరమైన చెన్నై సూపర్ కింగ్స్ నామమాత్రపు మ్యాచ్‌లో చక్కటి ఆటతీరు ప్రదర్శించింది. ఓపెనర్ ఆయుష్ మాత్రే (94) సంచలన ఇన్నింగ్స్ ఆడాడు.

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. చెన్నై కెప్టెన్ ధోనీ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన కోహ్లీ సంచలన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. 33 బంతుల్లో 62 పరుగులు చేసి అవుటయ్యాడు. అతడి ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు ఉన్నాయి. మరో ఓపెనర్ జాకబ్ బెతల్ (55) కూడా చక్కగా ఆడి హాఫ్ సెంచరీ చేశాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 97 పరుగుల జోడించారు.

చివర్లో షెపర్డ్ (14 బంతుల్లో 53 పరుగులు) ఈ సీజన్‌లో వేగవంతమైన హాఫ్ సెంచరీ చేసి బెంగళూరుకు భారీ స్కోరు అందించాడు. సిక్స్‌లు, ఫోర్లతో స్టేడియంను హోరెత్తించాడు. దీంతో ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 213 పరుగులు చేసింది. చెన్నై బౌలర్లలో మహేష్ పతిరణ మూడు వికెట్లు తీశాడు. నూర్ అహ్మద్, సామ్ కరన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

ఆర్సీబీ నిర్దేశించిన 214 పరుగుల లక్ష్య ఛేదనలో చెన్నై దీటుగా స్పందించింది. ఆయుష్ మాత్రే (94) సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. మరో ఓపెనర్ షేక్ రషీద్ (14)తో కలిసి తొలి వికెట్‌కు 51 పరుగులు జోడించాడు. రషీద్ అవుటైన తర్వాత వచ్చిన సామ్ కరన్ (5) ఎక్కువ సేపు క్రీజులో ఉండలేకపోయాడు. ఆ తర్వాత వచ్చిన రవీంద్ర జడేజా (74) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఆయుష్‌తో కలిసి మూడో వికెట్‌కు 114 పరుగులు జోడించాడు. సెంచరీకి చేరువలో ఉండగా ఆయుష్ అవుటయ్యాడు.

ఆ తర్వాత బంతికే బ్రేవిస్ పెవిలియన్ చేరాడు. చివర్లో ధోనీ (12) చెన్నైకు గెలిపించడానికి ప్రయత్నించాడు. అయితే బెంగళూరు బౌలర్లు చివర్లో కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో మ్యాచ్ చివరి వరకు వచ్చింది. చివరి బంతికి నాలుగు పరుగులు చేయాల్సిన దశలో చెన్నై బ్యాటర్ సింగిల్ మాత్రమే చేయడంతో ఆర్సీబీ విజయం సాధించింది.







## పాక్‌కు షాక్.. ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై భారత్ నిషేధం



**న్యూఢిల్లీ:** పెహల్‌గామ్ ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. దాడికి ప్రతీకార చర్యగా ఇస్లామాబాద్‌పై భారత్ ఆంక్షలు కొనసాగిస్తోంది. ఉగ్ర దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై దౌత్యపరమైన ఆంక్షలు విధించడమే కాకుండా దాయాది దేశాన్ని ఆర్థికపరమైన చక్రవ్యూహంలో బంధించేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. పాక్ నుంచి వచ్చే అన్ని దిగుమతులపై నిషేధం విధించింది ఆ దేశానికి షాక్ ఇచ్చింది.

ప్రత్యక్షంగా, పరోక్షంగా పాక్ నుంచి దిగుమతి చేసుకుంటున్న అన్ని రకాల వస్తువులను భారత్ నిషేధించింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య వ్యవహారాల మంత్రిత్వశాఖ శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు పాక్ నుంచి ఎలాంటి వస్తువులూ ఇక్కడకు దిగుమతి కావడానికి వీల్లేదని స్పష్టం చేసింది. జాతీయ భద్రత, ప్రజా విధానం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. పాకిస్థాన్ నుంచి మన దేశానికి రవాణా అయ్యే అన్ని ఉత్పత్తులకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టం చేసింది.

గత నెల 22న మధ్యాహ్నం జమ్ము కశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పెహల్‌గామ్‌లో గల బైసరాన్ వ్యాలీలో ఉగ్రవాదులు ఘాతుకానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ నరమేధంలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిని కేంద్రం తీవ్రంగా ఖండించింది. ఈ నేపథ్యంలో దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై చర్యలకు దిగింది. ఈ మేరకు కఠిన నిర్ణయాలు తీసుకుంటూ.. పాక్‌పై పలు ఆంక్షలు విధిస్తూ వస్తోంది. ఇప్పటికే వీసాలు రద్దు, సింధు జలాల ఒప్పందం నిలిపివేత, సిమ్లా ఒప్పందం నిలివేత, ఔషధాల ఎగుమతి, పాకిస్థాన్ నటుల సినిమాలు బ్యాన్, పాక్‌కు చెందిన పలువురి సోషల్ మీడియా ఖాతాలపై నిషేధం వంటి చర్యలు తీసుకుంది. ఇక పాక్ విమానాలకు భారత గగనతలం కూడా మూసివేసింది.

## ఈ పోస్టల్ స్కీమ్స్‌లో చేరడం ఇక మరింత సులువు..

### డిజిటల్ పద్ధతిలో ఖాతా తెరిచే సదుపాయం




**న్యూఢిల్లీ:** వివిధ రకాల పోస్టాఫీస్ పథకాల్లో చేరే ప్రక్రియను భారత తపాలా శాఖ మరింత సులభతరం చేసింది. మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ , టైమ్ డిపాజిట్, కిసాన్ వికాస్ పత్ర, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ లాంటి ఖాతాలను పూర్తి డిజిటల్ పద్ధతిలో తెరిచే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. కేవలం ఆధార్ బయోమెట్రిక్ ద్వారా ఆయా ఖాతాలు సులువుగా తెరిచే వెసులుబాటును కల్పించింది. పేపర్ వర్క్ అవసరాన్ని పూర్తిగా తప్పించింది.

పోస్టాఫీసు సేవింగ్స్ ఖాతా తెరవడానికి తపాలాశాఖ ఈ ఏడాది జనవరి నుంచి ఆధార్ బేస్డ్ ఈ-కేవైసీ విధానాన్ని అనుసరిస్తోంది. ఏప్రిల్ 24 నుంచి దీన్ని మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్, టైమ్ డిపాజిట్, కిసాన్ వికాస్ పత్ర, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ లాంటి పాపులర్ పథకాలకు విస్తరించింది. ఈ మేరకు తాజాగా ఓ సర్క్యులర్ జారీ చేసింది. పోస్టాఫీస్ కార్యాలయాల్లో ఆయా ఖాతాలన్నీ ఆధార్ ఈకేవైసీ సాయంతో సులువుగా తెరవవచ్చని పేర్కొన్నది.

పైన పేర్కొన్న పోస్టాఫీస్ ఖాతాల్లో ఏదైనా తెరవాలంటే ఇప్పుడు డిపాజిట్ వోచర్, ఫిజికల్ ఫారాలు నింపాల్సి ఉంటుంది. ఇక నుంచి ఆ అవసరం ఉండదు. పూర్తిగా డిజిటల్ విధానంలో ఖాతా తెరువనున్నారు. అయితే కొత్తపద్ధతితోపాటు పాత పద్ధతిని కూడా అందుబాటులో ఉంచనున్నారు. కావాలనుకున్న వాళ్లు పేపర్ వర్క్‌తో కూడా ఖాతాను తెరవచ్చు. డిజిటల్ పద్ధతిలో ఖాతా తెరవడానికి వెళ్లినప్పుడు పోస్టల్ అసిస్టెంట్ తొలుత డిపాజిటర్ నుంచి బయోమెట్రిక్ వివరాలు సేకరిస్తారు.

తర్వాత పేరు, స్కీమ్ టైప్, డిపాజిట్ మొత్తం లాంటి వివరాలు నమోదు చేస్తారు. వివరాలన్నీ ధ్రువీకరించుకున్నాక తుది సబ్మిషన్ కోసం మరోసారి ఖాతాదారు నుంచి బయోమెట్రిక్ వివరాలు సేకరిస్తారు. దాంతో లావాదేవీ పూర్తవుతుంది. డిపాజిట్ ఫారం నింపాల్సిన అవసరం రాదు. వివరాల నమోదు ప్రక్రియలో ఆధార్‌లోని తొలి 8 నంబర్లను పోస్టల్ సిబ్బంది మాస్క్ చేస్తారు. చివరి నాలుగు నంబర్లను సేకరిస్తారు. కాబట్టి భద్రతపై కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

## గత ఆర్థిక సంవత్సరం ఫోర్త్ క్వార్టర్‌లో ఎస్‌బీఐ నికర లాభం




**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజమైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో స్టాండలోన్ ప్రాతిపదికన ఎస్‌బీఐ రూ.18,642.59 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంతకుముందు ఆర్థిక ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఎస్‌బీఐ నికర లాభంలో 10 శాతం క్షీణత కనిపిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఎస్‌బీఐ రూ.20,698 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

సమీక్షా త్రైమాసికంలో ఎస్‌బీఐ బ్యాంక్ రూ.1,43,876 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ.1,28,412 కోట్లుగా ఉన్నట్లు ఎస్‌బీఐ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొన్నది. జనవరి-మార్చి మధ్య వడ్డీ రూపంలో రూ.1,19,666 కోట్లు ఆర్జించినట్లు బ్యాంక్ తెలిపింది. త్రైమాసిక ఫలితాల సందర్భంగా బ్యాంకు ఒక్కో షేరుకు రూ.15.90 చొప్పున డివిడెండ్ ప్రకటించింది.

సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ అసెట్ క్వాలిటీ మెరుగైంది. స్థూల నిరర్థక ఆస్తులు 2.24 శాతం నుంచి 1.82 శాతానికి తగ్గాయి. నికర నిరర్థక ఆస్తులు 0.57 శాతం నుంచి 0.47 శాతానికి తగ్గుముఖం పట్టాయి. ఏకీకృత ప్రాతిపదికన ఎస్‌బీఐ నికర లాభం 8 శాతం క్షీణించింది. గతేడాది జనవరి-మార్చి త్రైమాసికంలో రూ.21,384 కోట్లు కాగా.. ఈ సారి ఆ మొత్తం రూ.19,600 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం రూ.1.64 లక్షల కోట్ల నుంచి రూ.1.79 లక్షల కోట్లకు పెరిగింది.

ఇక పూర్తి ఆర్థిక సంవత్సరానికిగానూ స్టాండలోన్ ప్రాతిపదికన బ్యాంకు లాభం రూ.70,901 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఏడాది రూ.61,077 కోట్లతో పోలిస్తే 16 శాతం వృద్ధి కనబర్చింది.

## పహల్గాం ఉగ్రదాడి.. భారత్‌లో బాబర్ ఆజం సహా పాకిస్తాన్ క్రికెటర్ల ఇన్‌స్టా అకౌంట్లు బ్లాక్..!

**న్యూఢిల్లీ:** పాకిస్తాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజంతో సహా అనేక మంది పాకిస్తాన్ క్రికెటర్ల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను భారత్‌తో బ్లాక్ చేశారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తర్వాత కీలక చర్యలు తీసుకున్నారు. షాహీన్ అఫ్రిది, హసన్ అలీ, ఇమామ్ ఉల్ హక్, కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ అకౌంట్లను నిషేధించారు. భారత్ ఇప్పటికే ప్రముఖ పాకిస్తాన్ అథ్లెట్స్, క్రికెటర్లు, నటీనటులకు చెందిన యూట్యూబ్ చానెల్స్, ఇన్‌స్టా అకౌంట్లను బ్లాక్ చేసింది. ఒలింపిక్ ఛాంపియన్ జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్ ఇన్‌స్టాగ్రామ్ గురువారం బ్లాక్ అయ్యింది. తాజాగా పాకిస్తాన్ క్రికెటర్ల అకౌంట్లు సైతం బ్యాన్ అయ్యాయి. బాబర్, రిజ్వాన్‌తో సహా ఈ ప్రముఖ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను ఓపెన్ చేసేందుకు ప్రయత్నించగా.. ఈ అకౌంట్ భారత్‌లో అందుబాటులో లేదు' అనే సందేశాన్ని చూపిస్తున్నది.

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నాం అని కనిపిస్తోంది. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల్లో పర్యాటకులే ఎక్కువగా ఉన్నారు. ఈ ఉగ్రవాద దాడి తర్వాత భారత ప్రభుత్వం అనేక కఠినమైన నిర్ణయాలు తీసుకుంది. రెచ్చగొట్టే, సున్నితమైన మతపరమైన కంటెంట్‌ను వ్యాప్తి చేసే అనేక మంది పాకిస్తానీల యూట్యూబ్




ఛానెల్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను బ్లాక్ చేసింది. రావల్పిండి ఎక్స్‌ప్రెస్‌గా పేరొందిన షోయబ్ అక్తర్, పాకిస్తాన్ మాజీ కెప్టెన్ బాసిత్ అలీ యూట్యూబ్ ఛానెల్ 'బాసిత్ అలీ' పాకిస్తాన్ మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్, సీనియర్ జర్నలిస్ట్ నౌమాన్ నియాజ్ యూట్యూబ్ ఛానెల్ 'కాట్ బిహైండ్', పాకిస్తాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ తన్వీర్ అహ్మద్ యూట్యూబ్ ఛానెల్ 'తన్వీర్ సేస్' చానెల్స్ ఉన్నాయి. అలాగే, వాసేఇన్ఫీ చానెల్స్‌ని మూసివేశారు. అంతకు ముందు మహీరా ఖాన్, హానియా ఆమీర్ , అలీ జఫర్ అకౌంట్స్‌ని కేంద్రం బ్లాక్ చేసింది. 'మెరే హమ్‌సఫర్', 'కభీ మైన్ కభీ తుమ్' వంటి పాక్ వెబ్ సిరీస్‌లతో ప్రజాదరణ పొందింది నటి హానియా ఆమీర్.

పహల్గాం ఉగ్రదాడి తర్వాత స్పందిస్తూ తీవ్ర ఆవేదను వ్యక్తం చేశారు.

## వివాదాస్పద రీతిలో ఔట్..

### అంపైర్‌పై శుభమన్ గిల్ సీరియస్

**అహ్మదాబాద్:** శుభమన్ గిల్ తన సహనాన్ని కోల్పోయాడు. అంపైర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. హైదరాబాద్ సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభమన్ గిల్ వివాదాస్పద రీతిలో రనౌట్ అయ్యాడు. గిల్ ఆ మ్యాచ్‌లో 38 బంతుల్లో 76 రన్స్ చేసి ఔటయ్యాడు. అయితే 13వ ఓవర్‌లో జోస్ బట్లర్ బంతిని షార్ట్ ఫైన్ లెగ్ దిశగా ఆడాడు. ఓ సింగిల్ తీశాడు. అయితే ఫీల్డర్ హర్షల్ పటేల్ బంతిని అందుకుని వికెట్ల వైపు విసిరాడు. నాన్ స్ట్రయికర్ ఎండ్ నుంచి పరుగు కోసం వచ్చిన గిల్ క్రీజ్‌లోకి చేరుకోలేకపోయాడు. థార్డ్ అంపైర్ తన నిర్ణయాన్ని వెల్లడించడానికి చాలా సమయం తీసుకున్నాడు. బంతి నేరుగా స్టంప్స్‌కు తగిలిందా లేదా వికెట్ కీపర్ గ్లోవ్స్ ఆ స్టంప్స్‌కు తగిలిందా తేల్చడం ఇబ్బందిగా మారింది. కానీ చివరకు సన్‌రైజర్స్ జట్టుకు అనుకూలంగా థార్డ్ అంపైర్ తన నిర్ణయాన్ని ప్రకటించాడు.

థార్డ్ అంపైర్ ఇచ్చిన నిర్ణయం పట్ల గిల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. డగౌట్ వద్ద ఉన్న మ్యాచ్ అఫీషియల్‌తో వాగ్వాదానికి దిగాడు.



వాడివేడిగా తన ఔట్ గురించి చర్చించాడు. ఆ వాగ్వాదానికి చెందిన గొడవ కెమెరాలకు చిక్కింది.

ఫస్ట్ బ్యాటింగ్ చేసిన గుజరాత్ జట్టు ఆరు వికెట్లకు 224 రన్స్ చేసింది. గిల్ 76, సుదర్శన్ 48, బట్లర్ 64 రన్స్ చేశారు. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ జట్టు ఆరు వికెట్ల నష్టానికి 186 రన్స్ మాత్రమే చేసింది.

## ఐపీఎల్ టైటిల్ పోరులో ఆర్సీబీ బలమైన పోటీదారే

### సునీల్ గవాస్కర్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ టైటిల్ రేసులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు బలమైన పోటీదారని భారత జట్టు మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ అన్నారు. ప్రస్తుత సీజన్‌లో ఆర్‌సీబీ అద్భుతంగా రాణిస్తున్నది. ఆడిన పది మ్యాచుల్లో ఏడు విజయాలు, మూడో ఓటములతో 14 పాయింట్లతో పాయింట్ల పట్టికలో మూడోస్థానంలో ఉన్నది. ఈ సీజన్‌లో ఆర్‌సీబీ ఫుల్ ఫామ్‌లో కనిపిస్తున్నది. గతం కంటే భిన్నంగా ఈ సారి అన్నిరంగాల్లో సమతూకంగా కనిపిస్తున్నది. టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, దేవ్‌దత్ పడిక్కల్, జోష్ హాజిల్‌వుడ్ రూపంలో ఆ జట్టుకు మ్యాచ్ విన్నింగ్ ఆటగాళ్లు ఉన్నారు. జట్టు ఫామ్ గురించి మాట్లాడితే.. ముంబై ఇండియన్స్ మాత్రమే ఆర్‌సీబీ ఆల్ రౌండ్ బలానికి దగ్గరగా ఉన్న జట్టు గవాస్కర్ పేర్కొన్నారు. అయితే, ఆర్‌సీబీ ఐపీఎల్ టైటిల్‌కు బలమైన పోటీదారుగా గవాస్కర్ అభివర్ణించారు.



స్పోర్ట్స్ వెబ్‌సైట్‌తో మాట్లాడుతూ.. 'ఆర్‌సీబీ అద్భుతంగా బ్యాటింగ్ చేస్తుంది. అద్భుతంగా ఫీల్డింగ్ కూడా చేస్తుంది. ముంబయి జట్టుకు దగ్గరగా ఉంది. ముంబయి ఇప్పుడే వరుస విజయాలు సాధిస్తుంది. మరో మూడు కీలకమైన మ్యాచ్‌లు ఆ జట్టుకు ఉన్నాయని.. అదే ఆధిపత్యాన్ని కొనసాగిస్తారా? అన్నది ప్రశ్న. ఈ జోరును ఎలా కొనసాగించాలి అనేది ముఖ్యం. కానీ, ఆర్‌సీబీ ఖచ్చితంగా టైటిల్ పోరులో బలమైన జట్టు. సొంత మైదానంలో రికార్డు బాగాలేదు' అన్నారు. ఆర్‌సీబీ ఇప్పటి వరకు సొంత మైదానంలో జరిగిన మ్యాచుల్లో ఓటమిపాలైంది. ఇంకా ఆర్‌సీబీకి మూడు మ్యాచులు మిగిలి ఉన్నాయి. ఇందులో రెండు ఐపీఎల్ 2025 సీజన్‌లో ఒకసారి ఓడిన జట్లతోనే ఉన్నాయి. ఆర్‌సీబీకి నాలుగు మ్యాచుల్లో మూడు సొంత మైదానాల్లోనే ఉన్నాయి. చిన్నస్వామి మైదానంలో ఆర్‌సీబీ రికార్డును పరిశీలిస్తే.. ఇక్కడ రాణించడం ఆ జట్టుకు సవాల్‌గా మారింది.



## చిరు సరసన మరోమారు నయనతార

### అనిల్ రావిపూడి చిత్రం కోసం ప్రయత్నాలు

**టాకీస్:** చిరంజీవి, అనిల్ రావిపూడి కలయికలో వస్తున్న చిత్రంపై అనేకానేక ఊహాగానాలు వస్తున్నాయి. ఇందులో చిరుకు సరసన నయనతారను తీసుకుంటున్నట్లు వార్తలు వచ్చాయి. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించనున్న ఈ సినిమాని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే లాంఛనంగా ప్రారంభమైన ఈ చిత్రం ఇప్పుడు రెగ్యులర్ చిత్రీకరణకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే మిగిలిన ప్రధాన తారాగణాన్ని ఖరారు చేసే పనిలో చిత్రబృందం పడింది. ఇందులో చిరుకు జోడీగా ఇద్దరు కథానాయికలు కనిపించనున్నట్లు- ఇప్పటికే వార్తలొచ్చాయి. కాగా, అందులో ఓ నాయిక పాత్ర కోసం నటి నయనతారను తీసుకునేందుకు చిత్ర వర్గాలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయమై నయన్‌తో చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. అన్నీ అనుకున్నట్లు- జరిగితే ఇది చిరు - నయన్‌ల కాంబోలో హ్యాట్రిక్ సినిమా కానుంది. వీళ్లిద్దరూ గతంలో 'సైరా నరసింహారెడ్డి', 'గాడ్ ఫాదర్' సినిమాల్లో కలిసి సందడి చేశారు. ఇక ఈ చిత్రంలో మరో పాత్ర కోసం ఓ యువ నాయికను ఖరారు చేయనున్నారు. వినోదం, యాక్షన్, కుటుంబ అంశాలతో అల్లుకున్న కథతో రూపొందనున్న చిత్రమిది. చిరంజీవి



దీంట్లో శివ శంకర వరప్రసాద్‌గా తన ఒరిజినల్ పేరుతో ఉన్న పాత్రలో కనిపించనున్నారు. హీరో వెంకటేశ్ ఓ ప్రత్యేక పాత్రలో సందడి చేయనున్నారు. దీనికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.

## శ్రీలీలకు మరో లక్కీ ఛాన్స్



టాకీస్: ఒక్కప్పుడు ఐటమ్ సాంగ్స్ కోసం సెపరేట్ గా కొంత మంది హాట్ బ్యూటీలు ఉండే వారు. లేదంటే సెపరేట్‌గా కొంత మోడల్స్ అని ఐటెం గర్ల్స్ అని విదేశాల నుంచి తెల్ల తోలు బ్యూటీలని దింపే వారు. ఎందుకంటే హీరోయిన్‌లు ఇలాంటి పాటలు చేయడానికి నిరకరించేవారు. కానీ ప్రజంట్ స్టార్ హీరోయిన్స్ మాత్రం ఐటెం సాంగ్స్ చేసేందుకు ఏ మాత్రం వెనకాడడం లేదు. క్రేజ్‌కి క్రేజ్, రెమ్యునరేషన్‌కి రెమ్యునరేషన్ వస్తుండడంతో అసలు వదులుకోవడం లేదు. ఇందులో భాగంగా తాజాగా టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల.. మరో స్టార్ హీరోతో ఐటెం సాంగ్ చేసే ఛాన్స్ దక్కిందట. మెగా హీరో రామ్ చరణ్ నటిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'పెద్ది'. ఉప్పెన' ఫేమ్ సానా బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వ్రిద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్లు సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా, ఇందులో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. అయితే తాజా సమాచారం ప్రకారం ఇందులో ఓ మాస్ స్పెషల్ సాంగ్ ప్లాన్ చేస్తున్నాడట బుచ్చిబాబు. దీని కోసం రామ్ చరణ్ సరసన శ్రీ లీల స్టెప్పులు చేయబోతోందట. ఈ ఫుల్ ఎనర్జిటిక్ మాస్ సాంగ్‌తో థియేటర్ దద్దరిల్లేలా చేయనుందట శ్రీలీల. ఈ వార్తల్లో ఎంత వరకు నిజం ఉందో తేలినప్పటికీ ప్రజంట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.



### మరోమారు జోడీ కట్టబోతున్న

## రష్మిక, విజయ్

టాకీస్: ఆన్‌స్క్రీన్‌పై కొన్ని జోడీలకు ప్రత్యేకమైన ఫ్యాన్స్ ఉ ంటారు. అలాంటి ఓ జోడీనే విజయ్ దేవరకొండ-రష్మికలదని చెప్పవచ్చు. వీరిద్దరూ కలిసి వెండితెరపై రెండుసార్లు సందడి చేశారు. వీరిద్దరూ కలిసి 'గీత గోవిందం'లో నటించి మంచి ఆన్‌స్క్రీన్ పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. దీని తర్వాత 'డియర్ కామ్రేడ్'తో అలరించారు. ఈ చిత్రం కమర్షియల్‌గా హిట్ కాకపోయినప్పటికీ యూత్‌కు బాగా కనెక్ట్ అయింది. కెరీర్‌లో ఎన్ని సినిమాలు చేసినా ఈ చిత్రం వారికెంతో ప్రత్యేకమని గతంలో విజయ్, రష్మిక ఇద్దరూ వెల్లడించారు.ఇప్పుడు ఈ జోడీ మరోసారి ప్రేక్షకులను పలకరించనున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.



తాజాగా మైత్రీ మూవీస్ పెట్టిన ఓ పోస్ట్‌కు రష్మిక రిప్లై ఇవ్వడంతో ఆ వార్తలకు బలం చేకూరింది. విజయ్ దేవరకొండ ప్రస్తుతం 'కింగ్‌డమ్'తో బిజీగా ఉన్నారు. దీనితో పాటు ఆయన మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందనున్న ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ వచ్చే నెల నుంచి హైదరాబాద్‌లో చిత్రీకరణ ప్రారంభించుకోనుందని సమాచారం. ఇప్పుడీ చిత్రంలో విజయ్ సరసన రష్మిక నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనిపై నిర్మాణసంస్థ ఓ పోస్ట్ పెట్టింది. వేచి చూద్దాం అని అర్థం వచ్చేలా ఉంది. దీనికి రష్మిక ఒకే..' అంటూ నవ్వుతున్న ఎమోజీలను పోస్ట్ చేశారు. దీంతో వీరిద్దరి జోడీ ఖరారైందని అభిమానులు భావిస్తున్నారు. ఇదే నిజమైతే ముచ్చటగా మూడోసారి ఈ జోడీని చూడొచ్చని సంబరపడుతున్నారు.

## పొలిటికల్ ఎంట్రీపై స్పందించిన నటుడు అజిత్

**టాకీస్:** టాలీవుడ్ సినీ నటుడు అజిత్ తన పొలిటికల్ ఎంట్రీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇటీవలే పద్మభూషణ్ అవార్డు అందుకున్న ఈ నటుడు సినీ పరిశ్రమలో 33 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాజకీయాల్లోకి వస్తున్న సినీ కళాకారులందరికీ తన శుభాకాంక్షలు ఉంటాయని అజిత్ తెలిపారు. అయితే, వ్యక్తిగతంగా తనకు రాజకీయాల్లో పాల్గొనే ఉద్దేశం లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. రాజకీయాల్లో మార్పు తీసుకురాగలమనే విశ్వాసంతో అడుగులు వేస్తున్న వారందరూ విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అదే సమయంలో, తన స్నేహితుడు ప్రముఖ నటుడు విజయ్ పొలిటికల్ ఎంట్రీని సాహసోపేతమైన చర్యగా అజిత్ అభివర్ణించారు.



140 కోట్ల జనాభా కలిగిన భారతదేశంలో వివిధ మతాలు, జాతులు, భాషలు కలిగిన ప్రజలు సామరస్యంగా జీవిస్తున్నారని అజిత్ కొనియాడారు. ఇంతటి వైవిధ్యాన్ని కలిగి ఉన్న దేశాన్ని ఏకతాటిపై నడిపించడం రాజకీయ నాయకులకే సాధ్యమవుతుందని ఆయన అన్నారు. తాను ఇటీవల రాష్ట్రపతి భవన్‌ను సందర్శించినప్పుడు అక్కడి నియమాలు, భద్రతా ఏర్పాట్లు చూసి ఆశ్చర్యపోయానని అజిత్ వెల్లడించారు. దేశ నాయకులు తమ జీవితాలను ఎలా గడుపుతున్నారో అప్పుడే తనకు అర్థమైందని ఆయన చెప్పారు. ఆ నాయకులను చూసి తాను అసూయపడటం లేదని, ఒక దేశాన్ని లేదా రాష్ట్రాన్ని బాధ్యతగా నడిపించడం చాలా కష్టమైన పని అని తాను గ్రహించానని ఆయన అన్నారు. అందుకే నటుడు విజయ్ రాజకీయాల్లోకి రావడం ధైర్యమైన నిర్ణయమని ఆయన మరోసారి నొక్కి చెప్పారు.

## ప్యారడైజ్ షూటింగ్ ప్రారంభం

### నాని లేకుండానే చిన్ననాటి ఘటనలపై షూట్



**టాకీస్:** నాని హీరోగా నటించిన హిట్ థర్డ్ కేస్ అద్భుతమైన వసూళ్లు సాధిస్తూ దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. మొదటి రోజు 43 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించిన ఈ చిత్రం, రెండో రోజు 29 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ రాబట్టినట్లు- ప్రచారం జరుగుతోంది. ఆ సంగతి పక్కన పెడితే, ది ప్యారడైజ్ షూటింగ్ నుంచి ప్రారంభమైంది. అయితే, ఇంకా హిట్ ప్రమోషన్స్‌లో బిజీగా ఉ ండడంతో నాని షూట్‌లో పాల్గొనడం లేదు. ఈ నేపథ్యంలోనే నాని చిన్ననాటి ఎపిసోడ్ షూట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నాని అమెరికా ప్రమోషన్స్ కోసం వెళ్లారు. ఆయన అమెరికా నుంచి తిరిగి వచ్చి కొంత రెస్ట్ తీసుకోబోతున్నాడు. ఆ తర్వాత నాని కూడా ఈ షూట్‌లో జాయిన్ కాబోతున్నాడని, 18 నుంచి జరగబోయే షూట్‌లో పాల్గొనబోతున్నట్లు- తెలుస్తోంది. ఇక ముందుగా టాకీ పార్ట్ కొంత షూట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. శ్రీకాంత్ ఓదెల డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం మీద భారీ అంచనాలు ఉన్నాయి. రిలీజ్ చేసిన గ్లింప్స్‌తోనే ఒక్కసారిగా ఈ సినిమా మీద అన్ని వర్గాల్లో చర్చ మొదలైంది. సికిందరాబాద్ ప్యారడైజ్ ప్రాంతం నేపథ్యంలో ఈ కథ సాగుతున్నట్లు- ప్రచారం జరుగుతోంది. ఒక రకంగా రియల్ ఇన్సిడెంట్స్‌ని బేస్ చేసుకుని కథ రాసుకున్నట్లు- కూడా ప్రచారం జరుగుతోంది, కానీ దీనికి సంబంధించిన అధికారిక క్లారిటీ- ఇంకా లేదు. ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను సహనిర్మాణం చేసేందుకు సరిగమ సంస్థ కూడా రంగంలోకి దిగినట్లు చెబుతున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.